Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, అక్టోబర్ 18, 2025 | సంపుటి - 20 | సంచిక 38 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

### గ్రీన్‌కార్డ్ లాటరీలోనూ
## భారత్‌పై ఆంక్షలు



- తక్కువ వలసలు ఉన్న దేశాలకు ప్రాధాన్యం
- 2028 వరకు యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీకి దూరం
- భారతీయులు లక్ష్యంగా అమెరికా మరో నిర్ణయం

వాషింగ్టన్ : ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. మిగతా 2లో

# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

## ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు

- భారీగా ఆయుధాలు అప్పగింత
- వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం

మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీ సుల ముందు లొంగిపోయారు. లొంగి పోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు.





రాయపూర్ :

మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయు ధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్ గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మక మైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసి పోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ మిగతా 2లో

### బంద్ ఫర్ జస్టిస్..
## నేడు రాష్ట్ర బంద్


- బిసి సంఘాలకు అన్ని పార్టీల మద్దతు
- బిజెపి లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు
- బిసి బంద్‌కు మద్దతుగా సంఘాల ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య, కోదండరామ్



### స్థానిక ఎన్నికలు
# ఎప్పుడో చెప్పండి

## ప్రభుత్వం, ఈసీని ప్రశ్నించిన హైకోర్టు

### గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా




హైదరాబాద్ :

తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటు చేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్‌లో దాఖలు చేశారు. సుప్రీం కోర్టు ఈసీ నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయ డాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయ వాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయ స్థానంలో విచారణ జరిగింది. వాద నలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది.
మిగతా 2లో



2

### ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను
## కాపాడా

- అయినా తనను పక్కన పెడుతున్న పార్టీ
- మరోమారు అక్కసు వెళ్లగక్కిన రాజగోపాల్

నల్లగొండ : మంత్రి పదవి దక్కక పోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతపార్టీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని, కానీ పార్టీ తనను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బిసి బిల్లును అడ్డుకున్న
# పాపం బిజెపిదే

## బిల్లును అడ్డుకోవడం వల్లనే బిసి బంద్

- బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే
- దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- బిజెపిని డిమాండ్ చేసిన డిప్యూటి సిఎం భట్టి



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు.

ఖమ్మం :

చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెటామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డు పడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయ స్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు.
మిగతా 2లో


### నామినేషన్ దాఖలు చేసిన
# నవీన్ యాదవ్

- యూసుఫ్ గూడ నుంచి భారీ ర్యాలీతో రాక
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్



2

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు.



2

### భగ్గుమంటున్న
## బంగారం ధరలు

- అందనంతగా రోజురోజుకూ పెరుగుదల
- ఏకంగా 3వేలు పెరిగిన తులం బంగారం ధర

హైదరాబాద్ : బంగారం భగభగ మండుతోంది. సామాన్యులను ఊరిస్తున్న పుత్తడి సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి.

### అఫ్గాన్, భరత్‌లతో
## ఏకకాలంలో యుద్ధం చేస్తాం



### మరోమారు మాటలు తూలిన పాక్ రక్షణ మంత్రి

ఇస్లామాబాద్ : ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్నా పాక్ బుద్ధి మారడం లేదు. ప్రేలాపనలు ఆగడగం లేదు. అఫ్గాన్‌తో సరిహద్దె సమస్య, భారత్‌కు అఫ్గాన్ చేరువ కావడాన్ని పాక్ జీర్ణించుకోవడం లేదు.
మిగతా 2లో



2

### రాష్ట్రంలో
## గన్ కల్చర్

- పూర్తిగా తగ్గిపోయిన పెట్టుబడులు
- రాష్ట్రానికి రావాలంటేనే భయపడుతున్న పరిశ్రమలు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి హయాంలో పెట్టుబడులు తగ్గడంతో పాటు, తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు.



### ఆర్థిక సాయం మాత్రమే పేదరిక
## నిర్మూలన కాదు

- ఆత్మగౌరవంతో వారు ఎదిగేలా చేయాలి
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవంపై బాబు

అమరావతి : పేదరిక నిర్మూలన అంటే కేవలం ఆర్థిక సాయం చేయడం కాదని... వారి ఆత్మ గౌరవాన్ని కాపాడటం, ఎదగడానికి అవకాశాలను కల్పించడమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా సామాజిక మాద్యమం ఎక్స్ వేదికగా సీఎం స్పందించారు. మిగతా 2లో

### పత్తిని కేంద్రమే
# కొనుగోలు చేస్తుంది

### సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు
## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ :
కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ. 8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. మిగతా 2లో



### కాంగ్రెస్‌లో
## కరుగుతున్న కొండ

- ఏకాకిని చేసే ప్రయత్నాలు మొదలు
- వరుస ఘటనలే నిదర్శనమంటున్న పరిశీలకులు



వరంగల్ : వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయ కుంపటి రగులుతూనే ఉంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు మరింత రోత పుట్టిస్తున్నాయి. తాజా పరిణామాల వెనక ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డేనని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపించారు. తమపై రెడ్డికులాల ఆధిపత్యం రదుస్తోందని ఆమె ఘాటుగానే వ్యాఖ్యానించారు. వీరంతా కలసి తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండుతున్నారు.
మిగతా 2లో



2

### బిసి బంద్‌కు జాగృతి
## సంపూర్ణ మద్దతు

### ఆర్. కృష్ణయ్య లేఖపై కవిత వెల్లడి

హైదరాబాద్ : బీసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు.

## గ్రీన్‌కార్డ్ లాటరీలోనూ
# భారత్‌పై ఆంక్షలు

అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు. గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీలో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి. పెరోల్ ఫీజుపై అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు. ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ-పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు. ఈ తరహా ఆంక్షలపై ఎన్నారైలు మండిపడుతున్నారు.

# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్‌లో కరుగుతున్న కొండ

తమది కాంగ్రెస్ రక్తమని చెప్పుకుంటున్న కొండా సురేఖ మధ్యలో కొన్ని సంవత్సరాలు మాత్రం బీఆర్ఎస్‌లో కొనసాగారు. ఈ క్రమంలో టీడీపీలో పనిచేసి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు తమను టార్గెట్ చేశారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు. వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని గాంధీభవన్ వేదికగా ఆరోపించారు. ఇదే విషయమై అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వరకు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వరకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. మరోవైపు, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుకు వ్యతిరేకంగా కూడా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నిత్యం వార్తల్లో ఉండటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తమది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అని చెప్పడం, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పరిచయాలు ఉండడం, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేరుపెట్టి పిలిచే నాయకురాలిగా పేరు తెచ్చుకోవడంతోపాటు, చెప్పినట్టు వినరనే కారణంతో కొండా దంపతులను రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని వీరు ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి నటుడు నాగార్జున అంశంలోనే సురేఖపై వేటు తప్పదన్న వార్తలు వినిపించాయి. అప్పట్లో ఆమెను తప్పించాల్సిందేనని వైరివర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేసింది. ఈ ఫిర్యాదుల వెనక కూడా రెడ్డి సామాజికవర్గమే ఉన్నదని, రేవంత్‌రెడ్డి అండ చూసుకుని తమను వేధిస్తున్నారని అప్పట్లో కొండా దంపతులు ఆరోపించారు. ఇక గనుల వ్యవహారానికి వస్తే .. అక్రమాల నేపథ్యంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల జరిమానా విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నోటీసులు పంపింది. ఆ నోటీసులతో బిత్తరపోయిన కంపెనీ యాజమాన్యం పలువురు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్టు సమాచారం. దీంతో బంతి తన కోర్టులోకి వచ్చిందని నిర్ధారించుకున్న ఓఎస్డీ సుమంత్.. కంపెనీ యాజమాన్యంతో బేరసారాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో జరిగిన వ సూళ్ల, పంపకాల తేడాతో వ్యవహారం రచ్చకెక్కినట్టు చెప్తున్నారు. తాజా పరిణామాలపై సురేఖ కూతురు సుస్మిత సెల్ఫీవీడియో ద్వారా అందించిన వివరాలతో తీగ లాగితే హుజూర్‌నగర్‌లోని సున్నపురాయి నిక్షేపాల డొంక కదులుతున్నదని స్పష్టమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరిపారు. సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్టులో ఎన్‌సీఎల్ అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను తవ్వుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూ గర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ-టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకుకు బిడ్ దాఖలు చేసి మైనింగ్ లీజు దక్కించుకోవడం గమనార్హం. కానీ మిగిలిన రెండు బ్లాకుల జోలికి వెళ్లలేదు. గనుల వ్యవహారంలో రూ.1500 కోట్ల స్కాం జరిగిందని వెంటక్ రెడ్డి అనే వ్యక్తి పేర్కొన్నారు. దీనిపై అతను సమాచారశాఖ ద్వారా ఫిర్యాదు చేస్తే... ఆ ఫిర్యాదును రాష్ట్ర గనుల శాఖకు పంపినట్టు సమాధానం ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మొత్తంగా ఇప్పుడు పార్టీలో కొండా సురేఖ ఏకాకి అయ్యారనే అంటున్నారు. రాజకీయంగా ఆమెను ఒంటరి చేశారని అంటున్నారు.

# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హైకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరపు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్ యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

# బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

హైదరాబాద్ : బంద్ ఫర్ జస్టిస్ పేరుతో18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో బంద్‌కు మద్దతుగా అఖిలపక్ష, బీసీ సంఘాలు హైదరాబాద్‌లో ముందస్తు సంఘీభావ ర్యాలీ నిర్వహించాయి. బషీరాబాగ్ కూడలి నుంచి ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. బీసీ ఐకాస చైర్మన్ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బీసీ ఐకాస వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌ఉ మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# అఫ్గాన్, భరత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

అవసరమైతే ఈ రెండు దేశాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తామని మరోమారు పాక్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాటలు తూలారు. ఈ రకంగా భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనకు దిగింది. అఫ్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ..ఖ్వాజా ఆసిఫ్ ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా...అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను అని చెప్పనంటూ భారత్ గురించి నోరుపారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దాంతో ఇరువైపులా ప్రాణనష్టం సంభవించింది. పాక్ పై దాడులు ప్రారంభమైనపుడు అఫ్గాన్ విదేశాంగ మంత్రి దిల్లీలోనే ఉన్నారని, భారత ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపిస్తోంది. భారత్ తరఫున అఫ్గానిస్థాన్ తమపై పరోక్షయుద్ధం చేస్తోందని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆరోపణలు చేశారు. వీటికి భారత్ ప్రభుత్వం గట్టిగా కౌంటర్ ఇచ్చింది. పాక్ ఉగ్రవాద సంస్థలకు ఆతిథ్యమిచ్చి వారి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. తన అంతర్గత వైఫల్యాలకు పొరుగువారిని నిందించటం ఆ దేశానికున్న అలవాటు. అఫ్గానిస్థాన్ తన సొంత భూభాగాలపై సార్వభౌమత్వాన్ని చెలాయించడం పాక్‌కు కోపం తెప్పిస్తోందని భారత విదేశాంగశాఖ మండిపడింది.

# భగ్గుమంటున్న బంగారం ధరలు

ఏకంగా రూ.1.40 లక్షల వైపుకు దూసుకెళ్తోంది. ధనత్రయోదశి కి ఒక్కరోజు ముందు బంగారం ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.3 వేలకుపైనే పెరిగింది. ఫలితంగా తులం బంగారం రూ.1.35 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,250గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.1,81,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా-అమెరికా మధ్య టారిఫ్‌లు కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ఓ కారణంగా చెబుతున్నారు. అంతేకాదు, ధనత్రయోదశి. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. బంగారం కొనుగోలు చేస్తే సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆరోజు బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

# బిసి బంద్‌కు జాగృతి సంపూర్ణ మద్దతు

బీసీల రిజర్వేషన్ల కోసం తాను పోరాడతానని ఉద్ఘాటించారు. బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18వ తేదిన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలపాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. అయితే, ఆర్. కృష్ణయ్య లేఖపై స్పందించారు కవిత. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని... అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్లు భావించాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బీసీ రిజర్వేషన్లపై ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

## ఆస్తులు అమ్ముకుని
# కాంగ్రెస్‌ను కాపాడా

బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని, తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, అతని కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారని మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడిన నన్ను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఎక్సైజ్ నిబంధనలకు తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే సొంత నిబంధనలు ఖరారు చేయడం మునుగోడు నియోజకవర్గంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిబంధనల పేరుతో జారీ చేసిన అంశాలపై సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన స్పందిస్తూ కేవలం ప్రజలకు మేలు చేసేందుకే అని అన్నారు. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని,వైన్ షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించారు . మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. వైన్ షాప్‌లు ఊరి బయట మాత్రమే పెట్టాలని,వైన్ షాప్ కు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఉండవద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని , లాటరీ విధానంలో వైన్స్ షాప్ లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదని పేర్కొన్నారు. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్‌ల నిర్మూలన, మహిళల సాధికారతే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

# పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు.పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో గన్ కల్చర్

నివేదికల ప్రకారం తమ హయాంలో కన్నా పెట్టు బడులు పూర్తిగా తగ్గి పోయాయని అన్నారు. బెదరింపులు, వసూళ్లే ఇందుకు కారణమని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేబినెట్ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు.మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు. శుక్రవారం)తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగదీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత జరుగు తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదు..? అని నిలదీశారు. మంత్రుల పంచాయితీలు పరిష్కరించడానికే కేబినెట్ సమావేశాలు పెడుతున్నారని సెటైర్లు గుప్పించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కేబినెట్ భేటీలో మంత్రులు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ ఆరడజను వర్గాలుగా విడిపోయిందని దెప్పిపొడిచారు. రాష్ట్ర ప్రభుత్వం అతుకుల బొంతలాగా మారిందని స్వయానా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలోని 23 నెలల్లో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దు కోవాలన్న చందంగా.. కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధుల వాటాలు సాధించామని అన్నారు. హ్యామ్ మోడల్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని హెచ్చరించారు.

# ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డులు

## రాష్ట్రపతి ముర్మునుంచి అవార్డు అందున్న సెక్రటరీ గౌరవ్ ఉప్పల్

న్యూఢిల్లీ,అక్టోబర్17 : ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరపున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు - ఖఓ-ఏంఔఓంఔ, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు.




ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేష్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వానికి లేఖ

### హైకోర్టుకు వివరించిన ఇసి తరపు లాయర్

హైదరాబాద్,అక్టోబరు17 : బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాశామని.. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి 3 వారాల సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఈక్రమంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు 2 వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# గతంలో లాలూ హయంలో జంగిల్ రాజ్యం

### మళ్లీ కొత్త ముఖంతో వస్తోన్న మహాఘట్‌బంధన్

పాట్నా,అక్టోబర్17 : ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ హయాంలో బిహార్‌లో 15 ఏళ్ల పాటు 'ఆటవిక రాజ్యం' సాగిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. దీంతో రాష్ట్రం అర్ధ శతాబ్దం వెనక్కి వెళ్లిపోయిందని, ఆ సమయంలో బిహార్ గౌరవం, వైభవం, ప్రతిభ వంటివన్నీ కోల్పోయాయని తెలిపారు. ఇప్పుడు ఇదే 'జంగిల్ రాజ్' కొత్త ముఖాలతో ప్రజల ముందుకు వస్తోందని తేజస్వి యాదవ్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. బిహార్‌లోని పాట్నాలో శుక్రవారంనాడు జరిగిన మేధావుల సదస్సులో అమిత్‌షా మాట్లాడుతూ, ఆర్జేడీ ఆటవిక పాలనతో స్వాతంత్య్రం వచ్చిన తర్వాత బిహార్‌లో ఏర్పాటు చేసిన పరిశ్రమలన్నీ రాష్ట్రాన్ని వదిలిపోయాయని చెప్పారు. అవినీతి కేసులో జైలు నుంచి లాలూ ప్రసాద్ వచ్చినప్పుడు ఏనుగుపై ఊరేగింపు జరిపారని, ఇదెంత సిగ్గుచోటు వ్యవహారమో మనం ఊహించలేమని అన్నారు. బిహార్‌లో అప్పట్లో మీరు 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించిన విషయం లాలూ, రాహుల్ కంపెనీకి గుర్తుందా అని అమిత్‌షా ప్రశ్నించారు. భద్రతా ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని ఆర్జేడీ హయాంలో 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిందని, బిహార్ ఇప్పుడు సురక్షితంగా ఉన్నందునే కేవలం రెండు విడతల్లోనే ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# రాజకీయాల్లో యువతకు భాగస్వామ్యం

### సేనతో సేనాని పేరిట వినూత్న కార్యక్రమం

### డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి,అక్టోబరు17 : రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 'సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ఖీఖీ కోడ్ స్కాన్ చేసి, లేదా లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

# 19న విడుదల కానున్న టిటిడి జనవరి కోటా

తిరుమల,అక్టోబర్17 : వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్లను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందినవారు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను ఈనెల 23న ఉదయం పది 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా కూడా 23 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉండనుంది. శ్రీవాని ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. శ్రీవారి ఆర్జిత, దర్శన టికెట్లను వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది.

# బీహార్ మహాఘట్‌బంధన్ సిఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్

### కాంగ్రెస్ ఎంపి అఖిలేష్ ప్రసాద్ సింగ్ ప్రకటన

పాట్నా,అక్టోబర్17 : బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ దగ్గర పడుతుండగా విపక్ష మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత వచ్చింది. కూటమి ప్రధాన భాగస్వామ పక్షమైన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ 'మహాఘట్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి అని కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ అధికారికంగా శుక్రవారం నాడు ధ్రువీకరించారు. పాట్నాలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, బీజేపీ-జేడీయూ కూటమికి వ్యతిరేకంగా విపక్ష ఐక్య కూటమి పోటీకి కట్టుబడి ఉందని చెప్పారు. 'తేజస్వి యాదవ్ మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి. సీట్ల షేరింగ్ ప్రక్రియ త్వరలోనే ఖరారవుతుంది' అని సింగ్ తెలిపారు. సింగ్‌తోపాటు ఇంతకుముందు కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ సైతం సీఎం అభ్యర్థిత్వంపై తేజస్వి యాదవ్‌కు మద్దతుగా మాట్లాడారు. తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించడంలో తప్పేమీలేదన్నారు. ఎన్డీయే కూడా తమ ముఖ్యమంత్రి అభ్యర్థిపై స్పష్టత ఇవ్వాలన్నారు. తేజస్వి సీఎం అభ్యర్థిత్వంపై మహాకూటమిలో ఎలాంటి ఇబ్బందులు కనిపించనప్పటికీ సీట్ల పంకాల విషయంలో టెన్షన్ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ 48 మంది అభ్యర్థుల జాబితాను గురువారం నాడు ప్రకటించింది. అయితే భాగస్వామ్య పక్షాలతో విభేదాలు ఇంకా సమసిపోలేదు. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్ ముఖేష్ సహాని సీట్ల షేరింగ్‌పై అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోందని తారిఖ్ అన్వర్ తెలిపారు. తాము కూడా పొరపాటు చేశామని, తగినంత సమయం చేతిలో ఉన్నా ముందే సీట్ల షేరింగ్‌పై ఒక అవగాహనకు వచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కాగా, సీట్ల పంపకాల విషయంలో ఎలాంటి అసంతృప్తులకు తావీయకుండా ఎన్డీయే వ్యూహాత్మకంగా వ్యవహరించింది. జేడీయూ, బీజేపీలు చెరో 101 సీట్లలో పోటీ చేసేందుకు నిర్ణయించాయి. చిరాగ్ పాశ్వాన్ లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్) 29 స్థానాల్లోనూ, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హిందుస్థాన్ అవామ్ మోర్చా (సెక్యూలర్), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చెరో 6 స్థానాల్లోనూ పోటీ చేసేందుకు అవగాహన కుదిరింది. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

హైదరాబాద్,అక్టోబర్17 : నగరంలోని నిమ్స్ ఆసుపత్రి అనస్థీషియా వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. మృతుడు బీఎస్సీ నర్సింగ్ చేస్తున్న నితిన్‌గా గుర్తించారు. గురువారం విధులకు హాజరైన నితిన్.. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్లో విగతజీవిగా పడి ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన విద్యార్థి నిమ్స్‌లో న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా టెక్నీషియన్‌గా ఉన్నారు. నిమ్స్‌లోనే బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అయితే మరికొద్ది రోజుల్లో ఇంటర్నెట్ షిప్ పూర్తవుతుందనుకున్న సమయంలో నితిన్ ఇలా చనిపోవడం సహచరులను షాక్‌కు గురిచేసింది. బోరబండలోని గవర్నమెంట్ హాస్టల్లో ఉంటూ నిమ్స్‌లో నితిన్ ఇంటర్న్ షిప్ చేస్తున్నాడు. అయితే రాత్రి విధులకు హాజరైన నితిన్ అర్ధరాత్రి కనిపించకుండాపోయాడు. ఉదయానికి ఆపరేషన్ థియేటర్‌లో డోర్ వెనకాల అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నితిన్‌ను గమనించిన హౌస్ కీపింగ్ సిబ్బంది వెంటనే నిమ్స్ సిబ్బందికి తెలియజేశారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఘటనా స్థలి నుంచి తరలించారు. కాజ్ ఆఫ్ డెత్‌పై పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించడం మొదలుపెట్టారు. నితిన్ ఆఖరి సారిగా ఎవరితో మాట్లాడాడు అనే దానిపై అతడి ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు నితిన్ మృతిపై నిమ్స్ యాజమాన్యం కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులకు పూర్తిగా సహకారం అందిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఇక నితిన్ మృతితో తోటి విద్యార్థులు, సీనియర్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీ అబ్బాయికి ప్రమాదం జరిగింది

# వృద్ధురాలిని మోసం చేసి 35లక్షలు మాయం

హైదరాబాద్,అక్టోబరు17 :డిజిటల్ యుగం కావడంతో దొంగలు.. సైబర్ కేటుగాళ్ల అవతారం ఎత్తారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మన అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. చదువుకున్న వాళ్లు, వృద్ధులు, మహిళలు, యువకులు ఇలా అన్ని వర్గాల వారిని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. 'మీ కొడుక్కి ప్రమాదం జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. హైదరాబాద్ నగరంలో 61 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. తాను లండన్ లో వైద్యుడిగా పని చేస్తున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అంతేకాక లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని విడతల వారీగా రూ. 35.23లక్షలు వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్ కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మారుమూల గ్రామాలకు సైతం నెట్ సేవలు

### రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ బలోపేతం

### కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

న్యూఢిల్లీ,అక్టోబరు17 : భారతదేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావలిసిన ఎకో సిస్టమ్స్ అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటు అయిన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. ఖర్చులు ఎక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో పోస్టల్ సంస్థను ఆదాయం అందించే సంస్థగా తీర్చిదిద్దుతామని పెమ్మసాని చంద్రశేఖర్ ఉద్ఘాటించారు.ప్రస్తుతం గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటైన తర్వాత చాలా సంస్థలు ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని వివరించారు. బెంగళూర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైందని.. ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని స్పష్టం చేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కామన్ మ్యాన్‌కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపుగా 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. టెలికాం వినియోగదారులన్ను ÷నాన్షియల్ ఫ్రాడ్‌ల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# జగన్ హయాంలో పోలవరం విధ్వంసం

### మళ్లీ ప్రాణంపోసిన ఘనత చంద్రబాబుదే: ఎమ్మెల్యే

విజయవాడ,అక్టోబర్17 : జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసం అయిందని మ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ప్రాణం పోశారని ఉద్ఘాటించారు. తిరుపూర్‌లో మీడియాతో మాట్లాడాడుతూ..వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం దీపావళి శుభవార్త చెప్పిందని పేర్కొన్నారు. నిర్వాసితుల కోసం కూటమి ప్రభుత్వం తాజాగా రూ.1,100 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఇదే ఏడాది జనవరిలో మరో రూ.1000 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. 16 నెలల్లోనే నిర్వాసితులకు రూ.2,100 కోట్లు తమ ప్రభుత్వంలో విడుదల చేశామని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులను విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. రివర్స్ టెండరింగ్ పేరుతో మొత్తం పోలవరం ప్రాజెక్టుని వరదల్లో ముంచేశారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ అసమర్థత కారణంగానే డయాఫ్రం వాల్ దెబ్బతిందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు వెల్లడించారని గుర్తుచేశారు. పోలవరం పూర్తికాకుండానే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు ఇస్తున్నట్లు జగన్ డ్రామా ఆడారని ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేసి జగన్ నవ్వులపాలయ్యారని సెటైర్లు గుప్పించారు.

# ఆర్థిక సాయం మాత్రమే పేదరిక నిర్మూలన కాదు

పేదరిక నిర్మూలన కోసం కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచి పనిచేస్తోందన్నారు. అనేక సంక్షేమ పథకాలు ఇస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అలాగే పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.స్వర్ణాంధ్ర విజన్ 2047 లోని ప్రధాన లక్ష్యం పేదరిక నిర్మూలన. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కూటమి ప్రభుత్వం మొదటి రోజు నుంచి పనిచేస్తోంది. 16 నెలల్లో 1 లక్ష కోట్ల రూపాయలకు మించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా నెలనెలా రూ.2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 207 'అన్న క్యాంటీన్లు' పునఃప్రారంభించి 5 రూపాయలకే పేదల ఆకలి తీరుస్తున్నాం. 'దీపం 2.0' పథకంతో పేదింటి మహిళలకు ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. పేదింటి పిల్లలు చదువుకుని వృద్ధిలోకి రావాలన్న లక్ష్యంతో ఇంట్లో ఎంత మంది చదువుతుంటే అంతమందికి 'తల్లికి వందనం' కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడతగా రూ.7,000లు జమ చేశాం. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.246 కోట్లు, ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం కింద రూ.435 కోట్లు ఇచ్చాం. ఇలా సంక్షేమ పథకాలు ఇస్తూనే పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంచుకున్న మార్గమే 'పి-4 జీరో పావర్టీ' కార్యక్రమం. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా ఈ లక్ష్యానికి మనందరం పునరంకితమవుదాం అని పిలుపునిస్తూ.... పీ-4 కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు.

# అటవీ అధికారులపై గిరిజనుల దాడి

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ సిబ్బందిపై ఆదివాసీ పోడు రైతులు శుక్రవారం వేట కొడవళ్లతో దాడి చేశారు. కరకగూడెం మండలం అశ్వాపురపాడు గ్రామం అటవీ ప్రాంతంలో దాడి చేశారు వలస ఆదివాసీ పోడు రైతులు. పోడు భూమిలో ఆదివాసీ గిరిజనులు హార్వేస్టర్ మిషన్ ద్వారా వరి పంట కోస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులపై ఆగ్రహంతో వలస ఆదివాసీ గిరిజనులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, కోటేష్‌కి గాయాలయ్యాయి. గాయాలైన అధికారులకి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివాసీ పోడు రైతులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అధికారులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ పోడు రైతులని పోలీసులు హెచ్చరించారు.

# ఎంపి మిథున్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి

### షరతలుతో కూడిన అనుమతి ఇచ్చిన ఎసిబి కోర్టు

విజయవాడ,అక్టోబర్17 : వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఊరట లభించింది. ఈనెల 23వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు న్యూయార్క్ వెళ్లడానికి షరతులతో కూడిన అనుమతిని విజయవాడ ఏసీబీ కోర్టు మంజూరు చేసింది. రూ.50,000 విలువచేసే రెండు జామీన్లను కోర్టులో సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. న్యూయార్క్‌లో ఎక్కడ బస చేస్తున్నారనే వివరాలను అందజేయాలని ఆజ్ఞాపించింది న్యాయస్థానం. మిథున్ రెడ్డి ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్లను కోర్టుకు వెంటనే తెలియజేయాలని ఆదేశించింది. మిథున్ రెడ్డి న్యూయార్క్ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే పాస్ పోర్టుని సిట్ అధికారులకు అప్పగించాలని షరతులు విధించింది. న్యూయార్క్ వెళ్లడానికి బుక్ చేసిన విమానం టికెట్ల ఫొటో కాపీలను కోర్టులో సమర్పించాలని విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# శాస్త్రీయ పురాతన పద్ధతుల్లో లీకేజీ నివారణ

సింహాచలం,అక్టోబర్17 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం ఆలయం పైకప్పు మరమ్మతు పనులను పురాతన శాస్త్రీయ విధానంలో చేపట్టడం వల్ల మరో 200 ఏళ్లపాటు లీకేజీ సమస్యలు ఉత్పన్నం కావని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చేపడితేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. దేవాలయాల్లో ఇలాంటి పద్ధతులే అవలంబిస్తారని గంటా అభిప్రాయపడ్డారు. పైకప్పు లీకేజీల నివారణ ప్రాజెక్టు పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పుణెకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియన్ ట్రస్టు.. రూ.5 కోట్ల వ్యయంతో ఫిబ్రవరిలో ప్రారంభించిన పనులను.. నిర్దేశించిన గడువు కంటే ముందుగానే పూర్తి చేసిందని తెలిపారు. కరక్కాయ, సున్నం, బెల్లం, బెండకాయ జిగురు తదితర పదార్థాల మిశ్రమాన్ని పైకప్పుమీద పూసి, సహజసిద్ధమైన రీతిలో లీకేజీలు నివారించారన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ ఆలయాల్లో లీకేజీల నివారణ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. గతంలో సిమెంట్, కాంక్రీట్‌తో లీకేజీల నివారణ పనులు చేపట్టినప్పటికీ ఫలితం ఇవ్వలేదని.. సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో ఇప్పుడు దానికి పరిష్కారం లభించిందన్నారు. దీంతో లీకేజీ సమస్య పరిష్కారం కావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

# హైదరాబాద్‌లో ఫారెక్స్ సంస్థలపై ఇడి దాడులు

హైదరాబాద్,అక్టోబర్17 : నగరంలోని విదేశీ నగదు మార్పిడి (ఫారెక్స్) సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (అధికారులు దాడులు నిర్వహించారు. ఆర్బీఐ లైసెన్స్ లేకుండానే సంస్థలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులపై ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫోరెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ ముసుగు తొలగుతోంది!

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. త్వరలోనే అంటే డిసెబర్‌లో రెండేళ్ల వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వంలో,పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అసలురంగు మెల్లగా బయలకు వస్తోంది. అధికారంలో ఉంటే అవినీతి అన్నది దానిచుట్టూ పెనవేసు కుంటుంది. మంత్రుల అవినీతిపై ఊరూవాడా గుసగుసలు ఎక్కువయ్యాయి. బిఆర్‌ఎస్ అవినీతి గురించి తిట్టిపోస్తున్నా... రెండేళ్ల కాలంలో ఒక్కటీ రుజువు చేయలేదు. ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు. ప్రచారం కోసం మాత్రం అవినీతిని వాడుకుంటున్నారు. ఇకపోతే సిఎం రేవంత్ రెడ్డి కూడా తనమానాన తన పనులు చేసుకుంటూ పోతున్నట్లుగా ఉంది. ఇటీవల మంత్రుల మధ్య కులపంచాయితీ మొదలయ్యింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ కుమార్ మధ్య పంచాయితీ సద్దుమణిగిందని అనిపించారు. అడ్లూరి, వివేక మధ్యన కూడా గొడవలు ఉన్నాయి. మంత్రుల్లో ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఇకపోతే బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తరవాత జివో ఇవ్వడం, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసుల వేయడం ద్వారా కాంగ్రెస్ అపరిపక్వ విధానాలు తేటతెల్లం అయ్యాయి. ఓ రకంగా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తూ ముందుకు సాగివుంటే ఇంత పంచాయితీ వచ్చేది కాదు. ఈ విషయంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారు. దీనిపై ఎంతధనం వెచ్చించారో ప్రజలకు చెప్పాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు, లాయర్లు, మంత్రుల ఢిల్లీ పర్యటనల ఖర్చులు తెలియచేసి నిజాయితీ చూపాలి. ఇకపోతే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అనర్హులకు కేటాయించారంటూ పలు జిల్లాల్లో ప్రజలు రోడ్డెక్కి నిలదీస్తున్నారు. కిలో రూపాయికి సన్న బియ్యం దాదాపు అందరికీ ముడుతున్నాయి. అందువల్ల పంచాయితీ రావడం లేదు. దుబారాను ఎలాగూ పట్టించుకోరన్నది తేలింది. ఇకపోతే మంత్రులపై వస్తున్న అవినీతిపైనా చర్చించాలి. కానీ చెప్పడం లేదు. ఇచ్చిన హామీలంటూ అనేకం అమలు చేయలేదు. కనీసం గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న బాధ్యతను కూడా ప్రభుత్వం ప్రదర్శించడం లేదు. వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎక్కడా తట్టెడు మన్ను పోయడం లేదు. ఉద్యోగుల్లో అవినీతి పెరిగింది. డబ్బులు లేనిదే ఫైలు కదలడం లేదు. ఎసిబి నామమాత్రపు దాడులను ఉద్యోగులు లెక్కచేయడం లేదు. ఇక కొత్తగా కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు నడుస్తోంది.ఆమె అవినీతిలో కూరుకుపోతున్న వైనం బాహాటంగా వినవస్తోంది. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తున్నది. దీనికితోడు సిఎం, మంత్రులు తనపై కక్షకట్టారని కొండా దంపతులు, కుటుంబం కూడా ఆరోపిస్తోంది.తాజాగా కేబినేట్‌కు డుమ్మా కొట్టారు. మొన్నటికి మొన్న మేడారం సమీక్షకు కూడా దూరంగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి బుధవారం పరామర్శ పేరుతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరూ హాజరైనా మంత్రి కొండా సురేఖ మాత్రం ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో ఆమె ప్రమేయం లేకుండా ఇన్‌చార్జి మంత్రి పేరుతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుండటం మంత్రి సురేఖకు ఆగ్రహం తెప్పించిందని అంటున్నారు. దీనికి తోడు మేడారం టెండర్ల లీకు వ్యవహారంలో సురేఖ ఓఎస్డీ సుమంత్ పాత్ర ఉన్నదనే అనుమానంతో ప్రభుత్వం ఆయనను ఆ పోస్టు నుంచి తొలగించింది. సుమంత్ కొండా సురేఖ నివాసంలోనే ఉన్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లారు. ఈ పరిణామాలన్నింటి వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారని కొండా సురేఖ కుమార్తె సుస్మితాపటేల్ ఆరోపించారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై సురేఖ చేసిన వ్యాఖ్యల నుంచి ఆమె ఓఎస్డీ తొలగింపు వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలు సంచలనంగా మారాయి. అయితే, ప్రతి ఘటనను తనకు అనుకూలంగా మలచుకున్న కొండా సురేఖ ఈసారి మాత్రం తమను 'రెడ్డి' సామాజికవర్గం టార్గెట్ చేసిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ముసలం పుట్టిందా అన్ని చర్చ సాగుతోంది. ఇన్నాళ్లూ గుట్టుగా సాగిన అవినీతి బయట ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. మంత్రుల మధ్య వివాదాలు, కొండా సురేఖ వర్సెస్ పొంగులేటి, మేడారం టెండర్లు.. ఇలా కొన్నిరోజులుగా బయటికి వచ్చినవన్నీ కొన్ని మాత్రమే. కానీ, తెరవెనక అవినీతి అనకొండలు ఉన్నట్టు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంతో బయటపడింది. మేడారం టెండర్ల నేపథ్యంలో మంత్రుల మధ్య విబేధాలు బయటపడినట్టు కనిపిస్తున్నా..ఈ వ్యవహారం కొండా సురేఖ చుట్టే తిరిగిందని ప్రచారం జరుగుతున్నది. సూర్యాపేట జిల్లాలోని సున్నపురాయి గనులను నిబంధనలకు విరుద్ధంగా రెండు సిమెంటు కంపెనీలకు కట్టబెట్టడంతో వచ్చిన ముడుపుల వ్యవహారమని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇకపోతే దక్కన్ సిమెంట్ కంపెనీపై అక్రమ మైనింగ్ వ్యవహారంలో భారీ జరిమానా పడినట్టు సమాచారం. మైనింగ్‌లో గనులతో పాటు అటవీ శాఖకు కూడా సంబంధం ఉంటుంది. కంపెనీల వ్యవహారంపై కొంతకాలం కిందట మంత్రి కొండాకు ఉప్పందడంతో ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలుస్తున్నది. ఈక్రమంలోనే సుమంత్ రంగంలోకి దిగి కంపెనీతో డీల్‌కు ప్రయత్నించాడనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల వల్లే మేడారం పనుల్లో సురేఖను దూరం పెట్టడం, ఓఎస్డీని తొలగించి మంగళవారం రాత్రి కొండా నివాసానికి పోలీసులను ఉసిగొల్పినట్టు స్పష్టమవుతున్నది. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం ఒక్కటే కనిపిస్తున్నా అనేక విధాలుగా అవినీతి గుప్పుమంటోంది. కెసిఆర్‌ను తిట్టిపోస్తూ ...వీరు కూడా అలాగే తయారయ్యారన్న ప్రచారం సాగుతోంది. పనులకు, బిల్లులకు పర్సెంటీజుల లేనిదే రావడం లేదంటున్నారు. కాంగ్రెస్ అవినీతి ఎప్పటికైనా బద్దలు కాక తప్పదని బిఆర్‌ఎస్ ధీమాగా ఉంది. తమ అవినీతి వ్యవహారం ఇక బయటకు రాదన్న భరోసా కూడా ఉంది.

# నడుస్తున్నది సర్కార్ కాదు, సర్కస్!



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండేండ్లు పూర్తికావస్తున్నది. ఆరు (420) గ్యారెంటీల పేరుతో అరచేతిలో స్వర్గం చూపి అధికారాన్ని హస్తగతం చేసుకున్నది కాంగ్రెస్ పార్టీ. క్రమంగా '420' హామీల అసలు స్వరూపం బయటపడటంతో ఇది ప్రజాపాలన కాదు, ప్రజా వంచన పాలన అని ప్రజలకు అర్థమైంది. ఈ సుమారు రెండేండ్ల పాలనలో పాత పేర్లు మార్చి కొత్త పేర్లు పెట్టడం, గతంలో ఎంపికైన అభ్యర్థులకే నియామక పత్రాలు ఇవ్వడం తప్పితే ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టిందీ లేదు. అనవసర హడావుడి తప్ప పాలనలో పస లేదు. పర్యవసానంగా రెండేండ్లకే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విముఖత, విరక్తి కలుగుతున్నది. చెప్పుకోవడానికి చేసిందేమీ లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతసేపూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలతోనే కాలం గడుపుతున్నది. విద్య, వైద్యం, వ్యవసాయరంగాలను నమ్ముకున్న రైతులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఇలా అన్ని వర్గాలు నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయాయి. పరిష్కారం కాని సమస్యలు సచివాలయంలో విడుదల కానీ బిల్లుల్లా గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఇక కాళేశ్వరం విషయానికి వస్తే%౫% పగుళ్లు ఏర్పడిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అంటే, కాళేశ్వరం ప్రాజెక్టే తెలంగాణకు ప్రాణధార అని ప్రభుత్వం ఒప్పుకున్నట్టే. ఇక బనకచర్ల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇక రైతులకు యూరియా సరఫరా విషయంలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. సరిపడా యూరియా దిగుమతి చేసుకోవడానికి ముందస్తు ప్రణాళిక లేని ప్రభుత్వం చేతులెత్తేసింది. పైగా యూరియాను బ్లాక్ చేస్తున్నారని రైతులనే నిందించారు. అయితే యూరియా కోసం లైన్లలో నిలబడి కొందరు రైతులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. రాష్ట్రం ప్రభుత్వం సర్కార్ బడులను బలోపేతం చేయకపోవడంతో వాటిలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. 78 శాతం పాఠశాలల్లో 100 కంటే తక్కువగా అడ్మిషన్లు జరగడం బాధాకరం. ఇక గురుకులాల పరిస్థితి మరీ దారుణం. అడ్మిషన్లు తగ్గాయని కొన్ని సంస్థల్లో ప్రధానోపాధ్యాయులకు మెమోలు జారీ చేసింది. విద్యార్థినీ విద్యార్థుల ఆత్మహత్యలు నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు వాటి యజమానులు తాళం వేస్తున్నారంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. కాగా, రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అంటూ ప్రభుత్వం కొత్తగా హడావుడి చేస్తున్నది. అవి ఏ మేర విజయం సాధిస్తాయో కాలమే నిర్ణయిస్తుంది. ఇదిలా ఉంటే పేద ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్న ఇండ్లను కూలగొడుతూ హైడ్రా పేరుతో మూసీ ఒడ్డునే గొప్ప గొప్ప కట్టడాలు నిర్మించుకున్న అస్మదీయులకు మాత్రం నోటీసులు జారీచేసి చేతులు దులుపుకోవడం పక్షపాత వైఖరిని సూచిస్తున్నది. హైడ్రా పేరున గొప్ప దందా జరుగుతున్నట్టు వింటున్నాం. అంటే పేదలను నిరాశ్రయులను చేస్తూనే పెద్దలను మాత్రం జాగ్రత్తగా కాపాడుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. భూ సేకరణ విషయానికి వస్తే ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ పేరుతో పెద్దల భూములను కాపాడుతూ పేదల భూములకు ఎసరు పెడుతున్నదీ ప్రభుత్వం. అస్మదీయులకు లబ్ధి చేకూర్చేలా ట్రిపుల్ ఆర్ రీ అలైన్మెంట్ జరుగుతున్నదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే విమర్శిస్తుండటం గమనార్హం. ఇక ఉద్యోగులను, పెన్షనర్లను ఎన్నికలకు ముందు ఎన్నో విధాలుగా మభ్యపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. గద్దెనెక్కిన 6 నెలల్లోనే పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేస్తామంటూ ప్రలోభపెట్టి ఈ రెండేండ్ల కాలంలో కేవలం రెండు డీఏలు మాత్రమే ఇచ్చింది. పైగా ఇదే గగనమైందంటూ కొత్త పాట పాడుతున్నది. ఇక రిటైర్ అయిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్ లేవు. కోర్టుల నుంచి చెల్లింపు ఉత్తర్వులు తెచ్చుకున్నా అవి ఆర్థిక శాఖలో చెల్లడం లేదు. కమీషన్ల దందా చాలా బాగా నడుస్తున్నది. 2023లో రిటైర్ అయిన వారి బిల్లులు పెండింగ్‌లో ఉండగా 20 24లో రిటైర్ అయిన వారి వద్ద లంచాలు తీసుకొని బకాయిలు విడుదల చేసినట్టు సంఘాల ప్రతినిధులే ఆరోపిస్తున్నారు. కొంతమంది పెన్షనర్లు చేతికొస్తుందనుకున్న సొమ్ము రాక భంగపడి బలవన్మరణాలకు పాల్పడటం శోచనీయం. ఇక రాష్ట్ర మంత్రుల విషయానికి వస్తే వారి ది రోజుకో లొల్లి. వారి మధ్య సయోధ్య ఒక మిథ్య. ముఖ్యమంత్రికి తెలువకుండా, తెలుపకుండా కొందరు మంత్రులు ఢిల్లీ అధిష్ఠా నంతో మంతనాలు జరుపుతున్నారు. ఢిల్లీ పర్యటనలు జరుపుతారు. మంత్రుల మధ్య కమీషన్ల విషయం రచ్చకెక్కింది. కులాల కుంపట్లు రోజురోజుకు రాజుకుంటున్నాయి. ఒకరిపై ఒకరు బాహాటంగానే దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఒకరిని ఒకరు విమర్శించుకోవడం తెలంగాణ సమాజానికి అసహ్యంగా ఉన్నది. ఒకరి శాఖలో మరొకరు వేలు పెడుతున్నారని బాహాటంగానే మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కానీ, పీసీసీ అధ్యక్షుడు కానీ ఈ తగాదాలను తీర్చలేక తమ పార్టీలో ప్రజాస్వా మ్యం పాలు కాస్త ఎక్కువ అంటూ 'కింద పడ్డా మొహం పైకే' అన్న చందాన వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 2.3 లక్షల కోట్లు అప్పు చేసింది. గత మూడు, నాలుగు నెలలుగా ప్రతి ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నదని ఆర్థికవేత్తలు అంటున్నారు. వరుసగా గత మూడు నెలలుగా జాతీయ సగటు ఆర్థిక పరిస్థితి 1.54 ఉండగా రాష్ట్రస్థాయి మైనస్‌లో ఉండటం ప్రమాదకర స్థితిని సూచిస్తున్నది. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని నిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రతి రంగంలోనూ ప్రభుత్వ అసమర్థత లేదా క్రియాశూన్యత స్పష్టమవుతున్నది. దిద్దుబాటు చర్యలు లేవు. చేసిన వాగ్దానాలు, కొత్త పథకాలు పక్కన పెట్టి అమలులో ఉన్న పథకాలు అటకెక్కించక కొనసాగిస్తే అదే గొప్ప అన్న పరిస్థితి దాపురించింది. ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తున్నది. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు తెలంగాణ సమాజాన్ని ముంచెత్తుతున్నాయి. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. సమాజంలో నేరపూరిత వాతావరణం రోజురోజుకు పెరుగుతున్నది. ప్రభుత్వ అచేతనత్వం దానికి మరింత దోహదపడుతున్నది. మొత్తంగా రాష్ట్రంలో ప్రభు త్వం ఉన్నదా? ఉంటే, అది పనిచేస్తున్నదా అనే సందేహం ప్రజలకు కలుగుతున్నది.

## ఫెస్టివల్ ఎఫెక్ట్.. ఐఆర్‌సీటీసీ సేవల్లో అంతరాయం

ధంతేరస్, దీపావళి ఛర్‌పూజ ఇలా వరుస పండుగలు రావడంతో పట్నం వాసులు పల్లెబాట పట్టారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైలు టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించగా.. వారికి నిరాశే ఎదురైంది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం తత్కాల్ టికెట్స్ బుకింగ్ సమయంలో ఈ సమస్య తలెత్తింది. సర్వర్ డౌన్ కావడంతో సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ కారణంగా లక్షలాది మంది ప్రయాణికులు రైలు టికెట్స్ బుక్ చేసుకోలేకపోయారు. పండగల వేళ ఈ అంతారం ఏర్పడటంతో ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ డౌన్ అయ్యిందంటూ సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెడుతున్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్‌లో ఎర్రర్ వస్తోందని పేర్కొంటున్నారు. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం కలగడం ఇదేమీ మొదటిసారి కాదు. ఇటీవలే కాలంలో తరచూ ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహకానికి గురవుతున్నారు.





## దీపావళి ముందురోజు ధనత్రయోదశి

### బంగారం వెండి కొనుగోళ్లపై ఉత్తరాదిలో నమ్మిక

న్యూఢిల్లీ,అక్టోబర్17 : ధంతేరస్... దీపావళి పండుగకు ముందు త్రయోదశి నాడు వస్తుంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు ధంతేరస్ పర్వదినం జరుపుకుంటారు. అందుకే ధంతేరస్‌ను ధనత్రయోదశి అని కూడా పిలుస్తారు. ఈ ఏడాది అక్టోబర్ 18న శనివారం ధంతేరస్ వచ్చింది. ధంతేరస్‌తోనే దీపావళి పండుగ వేడుకలు మొదలవుతాయి. ఐదు రోజుల పాటు సాగుతాయి. అంతేకాదు.. దీపావళికి ముందు వచ్చే ఈ త్రయోదశిని ధంతేరస్.. ధన త్రయోదశి.. చోటీ దీపావళి అంటారు. ఇక ధంతేరస్‌ను ధనలక్ష్మిని ఆరాధించే పవిత్రమైన రోజుగా అభివర్ణిస్తారు. భక్తుల కోరికలను తీర్చడానికి 'అదృష్ట లక్ష్మి' తనను పూజించే ప్రతి ఇంటికీ ఈ రోజు అతిథిగా విచ్చేస్తుందన్నది ఒక నమ్మకం. అందుకే ఈ పండుగ రోజు బంగారం, వెండి వంటి వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదమని ప్రజల విశ్వాసం. ధనత్రయోది రోజున కొంచెంకానీ బంగారం, వెండి కొనుగోలు చేస్తుంటారు ప్రజలు. ఇక వ్యాపారులు కొత్త ఒప్పందాలు చేసుకోవాలన్నా, నూతన వ్యాపార లావాదేవీలకు శ్రీకారం చుట్టాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా 'ధన్‌తేరస్' అనువైన రోజగా భావిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ధంతేరస్‌ను 'అదృష్ట లక్ష్మి' అతిథిగా వచ్చే రోజుగా భావిస్తారు. ధన త్రయోదశి అంటే సంపద, శ్రేయస్సు పెంచే త్రయోదశి అని అర్థం. ధంతేరస్ నాడు ధన్వంతరికి, కుబేరుడితోపాటు లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. దేవదానవులు సముద్ర మథనం చేస్తున్న వేళ.. ధన్వంతరి భగవానుడి చేతిలో కలశంతో దర్శనం ఆచ్చారని అంతా నమ్ముతారు. మరి కొన్ని చోట్ల అపమృత్యు నివారణ కోసం దీపాలను వెలిగించడం సంప్రదాయం. ధనత్రయోదశినే కొన్ని ప్రాంతాల్లో 'యమ త్రయోదశి' అని కూడా పిలుస్తారు. ఈ రోజున సాయంత్రం భక్తులందరూ లక్ష్మీదేవిని పూజిస్తారు. ఇంటి చుట్టూ దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. ఈ పూజలో భాగంగా గోధుమ, పెసలు, మినుములు, కందులు, బార్లీ .. మొదలైన వాటిని అమ్మవారికి సమర్పిస్తారు. అలాగే అపమృత్యు నివారణ కోసం నూనెతో దీపం వెలిగిస్తారు. దీనినే 'యమదీపం' అని కూడా అంటారు. దంతేరస్ నాడు బంగారం, వెండి.. విలువైన ఆభరణాలను కొనుగోలు చేస్తే కలిసిరావడంతోపాటు శుభప్రదం అని చెబుతారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఈ రోజు ఏం కొనుగోలు చేసినా రెట్టింపవుతుందని విశ్వాసం. అందుకే ఈ పర్వదినం నాడు బంగారం, వెండితోపాటుగా ఇంట్లోకి అవసరమైన ఇతర వస్తువులను కూడా కొనుగోలు చేస్తారు. బంగారం, వెండి వస్తువులతోపాటు వెండి లక్ష్మి, గణెళిశుడి విగ్రహాలను కొనుగోలు చేయవచ్చు. చీపురును లక్ష్మీదేవి రూపంగా పరిగణిస్తారు. ఈ రోజు చీపురు కొనడంతో పేదరికం, కష్టాలు, అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని ప్రతీతి. వాహనం కొనడం కూడా శ్రేయస్కరమే. అయితే పెరుగుతున్న బంగారం, వెండిలతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

## పరిమితిలోనే స్వేచ్ఛకు విలువ

ఒక యువకుడు నది ఒడ్డున కూర్చుని ఉన్నాడు. అక్కడే చాలా కుక్కలు తిరుగుతూ ఉన్నాయి. ఆ యువకుడు చేతిలోకి కొన్ని రాళ్లను తీసుకుని కనిపించిన ప్రతి కుక్కనీ కొడుతున్నాడు. దెబ్బతిన్న కుక్కలు 'కుయ్ కుయ్' అని అరుస్తూ పరుగులు తీస్తున్నాయి. అప్పుడే ఒక పండితుడు అటుగా వెళ్తూ ఉన్నాడు. ఆ యువకుడు చేసే నిర్వాకం చూసి పండితుడు కొద్దిసేపు అక్కడే ఆగాడు. 'ఎందుకు వాటిని కారణం లేకుండా కొడుతున్నావ'ని అడిగాడు. 'అవి ఎదురు తిరగవు కదా, అందుకు కొడుతున్నాను. అయినా అది నా ఇష్టం. కుక్కలను కొట్టే స్వేచ్ఛ కూడా నాకు లేదా?' అని ఎదురు ప్రశ్న వేశాడు. పండితుడు అతని కళ్లలోకి చూస్తూ 'ఎదురు తిరగవని ఆ మూగ జీవాలను కొట్టడం ఎంతవరకు సమంజసం? అయినా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నావు. స్వేచ్ఛ అంటే ఇది కాదు. పక్కనే పారుతున్న నదిని చూసి తెలుసుకో' అన్నాడు. నదిని చూసిన యువకుడు 'నదికేమి? తనకు ఇష్టం వచ్చిన దిశగా, స్వేచ్ఛగా ఉరకలేస్తూ ప్రవహిస్తున్నది' అని సమాధానమిచ్చాడు. 'నదికి ఆ పక్కన ఏముంది? ఈ పక్కన ఏముంది?' అని అడిగాడు పండితుడు. అది కూడా తెలియదా అన్నట్లుగా 'ఆ పక్క ఒక ఒడ్డు, ఈ పక్క ఒక ఒడ్డు ఉంది' అని నీరసంగా బదులిచ్చాడు యువకుడు. 'అదే నేను చెప్పేది. రెండు ఒడ్డుల మధ్య ఉండటమనేది దానికున్న పరిమితి. ఒడ్డులే లేకపోతే అది నదీ కాదు, దాని స్వేచ్ఛకూ అర్థం లేదు. నువ్వు ఇంకో విషయం గమనించాల్సింది ఏమిటంటే మనం ఆ పక్క నుంచి ఈ పక్కకి, ఈ పక్క నుంచి ఆ పక్కకీ వెళ్లాలంటే ఈ ఒడ్డులనేవి ఉంటేనే సాధ్యం. అంతే కాకుండా రెండు ఒడ్డుల మధ్యన నది ప్రవహిస్తూ ఉంటే అందంగా ఉంటుంది. అదే నది, ఒడ్డులు దాటి ప్రవహిస్తే అల్లకల్లోలం అవుతుంది' అని వివరించాడు. 'క్రమశిక్షణతో ఉన్నప్పుడే స్వేచ్ఛకు విలువ. మన జీవితంలో కూడా స్వేచ్ఛకు పరిమితులున్నాయి' అని గుర్తించి కుక్కలని కొట్టడం మానుకున్నా డు ఆ యువకుడు.



ఆధ్యాత్మికం


## రిజర్వేషన్ల బహుజనబందుకు సంపూర్ణ మద్దతు

**- తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బిసి సంఘాల ఆద్వర్యంలో నేడు జరగబోయే తెలంగాణ బందుకు సంపూర్ణ మాద్దతునిస్తున్నామని తెలంగాణా రాజ్యాధికార పార్టీ నేతల ప్రకటించారు. శుక్రవారం ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి పార్టీలు బిసిల జపంచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీలకు మేలుచేసినట్టు నటించి నట్టేట ముంచిన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలను హెచ్చరిస్తున్నామన్నారు. నిబద్ధతతో కూడిన తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చిన జీవోతో 42శాతం రిజర్వేషన్ తీసుకరావాలని, లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల్లో మిమ్ములను చిత్తుగాఓడించి బీసీలను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు, వ్యాపారవేత్తలు, కాలేజీలు బందులో స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుండవేణ స్వామి, కాజీపేట ఉదయ్, జిల్లా ఉపాధ్యక్షులు అడ్లూరి గంగారం, జిల్లా నాయకులు బోప్పు జాషువా, ఉమ్మల రాజేందర్, పోలుదాసరి రాజయ్య, న్యాతరీ రాజశేఖర్, ఇందారపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అన్వేషిక ప్రయోగదర్శిని



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశీలన నైపుణ్యాన్ని ప్రయోగాలు ద్వారా పెంపొందించాలనే ప్రధాన ఉద్దేశంతో ఎస్సీఈఆర్టీ ప్రప్రథమంగా అన్వేషిక ప్రయోగ దర్శిని (ల్యాబ్ మానువల్ ) ముద్రించింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నేతృత్వంలో 32 మంది విషయ నిపుణులతో వీటిని రూపొందించారు. 6 నుండి 10 తరగతుల వారికి ఇవి ఎంతో ఉపయోగంగా ఉండేలా తీర్చిదిద్దారు. పాఠ్య పుస్తకాల్లోని విషయాలకు అనుగుణంగా ఉండడంతో పాటు పిల్లలు ప్రయోగాలతో సబ్జెక్టులపై పూర్తిస్థాయిలో అవగాహన పొంద దానికి ఇవి ఉపయోగపడతాయి. దశలవారీగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలకు ఇవి సరఫరా కానున్నాయి. పుస్తక రచనలో రాష్ట్రంలో 32 మంది సబ్జెక్టు టీచర్లు పాల్గొనగా అందులో పెద్దపల్లి జిల్లా నుండి పత్తిపాక జిల్లా పరిషత్ పాఠశాల నుండి ఎస్. కృష్ణ మోహన మూర్తి ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ప్రయోగాల ద్వారా జీవశాస్త్రంలోని అభ్యసన సామర్థ్యాలు వెలికి తీసేందుకు ఈ ప్రయోగదర్శిని ఎంతగానో ఉపయోగ పడుతుంది. పాఠ్యపుస్తకంలోని ప్రయోగశాల కృత్యాలతో పాటు అతను కృత్యాలను రూపొందించారు. ఇవి ఉపాధ్యాయులకు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో రూపొందించానని జీవశాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణ మోహన మూర్తి తెలిపారు.

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

**- అక్రమ కట్టడాన్ని తొలగించాలని కలెక్టరుకు ఫిర్యాదు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురయ్యింది. ఏకంగా పట్టణంలోని నడిరోడ్డును ఆనుకొని అక్రమదర్గా నిర్మాణం జరుగుతోంది. రోడ్డును ఆక్రమించుకొని మరీ నిర్మాణం జరుగుతున్నా అధికారులకు కనిపించడం లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని జిల్లా కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు పెద్దపల్లి నుండి చందపల్లికి వెళ్లే రోడ్డులో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని దర్గా నిర్మాణం చేపడుతున్నారని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ జిల్లా కలెక్టరుకు, ఆర్డీవో, మున్సిపల్ కమీషనరుకు శనివారం ఫిర్యాదు చేశారు. నిర్మాణాన్ని తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి వారు అనుమతి లేకుండా కట్టుకునే చిన్నచిన్న నిర్మాణాలకే పారలు, తట్టలు, పనిముట్లు ఎత్తుకెల్లే మున్సిపల్ సిబ్బందికి, పట్టణ నడిబొడ్డున అక్రమ దర్గా నిర్మాణం కనిపించడం లేదా అని నిలదీశారు. ఇదిలా ఉండగా పలు హిందూ సంఘాలు సైతం అక్రమ దర్గా నిర్మాణం విషయమై మున్సిపల్ కమీషనరుకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించని పక్షంలో హిందూ సంఘాల ఆద్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

## ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని సప్తగిరి కాలనీ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కె ఏ టి ఒలంపియాడ్ పరీక్షల్లో మరోసారి తమ ప్రతిభను ప్రదర్శించారు. 6వ నుండి 10వ తరగతుల వరకు మొత్తం 37 మంది విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించి, 2వ స్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థుల కఠోర శ్రమతో పాటు గురువుల అంకితభావం ఈ విజయానికి మూలం," అని అన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, మంచిర్యాల జోన్ ఏజీఎం అరవింద్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ బి.నాగరాజు విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ వెంకటస్వామి, సి బ్యాచ్ ఇంచార్జ్ అనిల్ పాల్గొన్నారు.

# దారి సమస్యను పరిష్కరిస్తా... గూడెం అభివృద్ధికి కృషి చేస్తా

### ◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**మానకొండూర్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం నిజాయితీ గూడెం గ్రామాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఇటీవల రహదారి ప్రమాదంలో మృతిచెందిన శామంతుల శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదంపై కేసును వేగవంతం చేయించి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ సిబ్బంది జిల్లెల ప్రభాకర్ కొన్ని నెలల క్రితం మృతి చెందగా ప్రభాకర్ భార్య సుమలతకు 10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామంలో మొగిలి సావిత్రమ్మ, దొంగల ప్రేమల ఇందిరమ్మ ఇండ్లను పొందగా ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాల్సిందిగా లబ్దిదారులకు సూచించారు. వికలాంగుడు పనస సత్తయ్య తనకు మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని కోరగా సంభందిత అధికారితో చరవాణిలో మాట్లాడి సత్తయ్యకు మూడు చక్రాల సైకిల్ ని ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. వీదుల్లో పర్యటిస్తూ ప్రజల బాగోగులు తెలుసుకునే క్రమంలో వంద సంవత్సరాల క్రితం నుండి బతుకమ్మ చేరువుకు ఉన్న దారి కబ్జాకు గురికాగా గత ఎమ్మెల్యే సమస్యకు పరిష్కరిష్కారం చూపలేదని తమరైనా పరిష్కరించాలనీ గ్రామానికి చెందిన పంతులు గొల్లపెల్లి రంగయ్య కొరగా ఒక్క దారి సమస్యను పరిష్కరించడమే కాక తాను ఎమ్మెల్యేగా ఉండగానే గూడెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండలాద్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ బోళ్ళ మురలీధర్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కుంభం చిరంజీవి, నాయకులు గడ్డి రవి, గడ్డి సంపత్, గడ్డి పర్శయ్య, శామంతుల సంపత్, గొల్లపెల్లెలి శ్రీను, సుదనగోని వీరాస్వామి, నన్నె మోహన్, కుంభం స్టాలిన్ పంచాయితీ కారోబార్ మొగిలి శ్రీనివాస్ గ్రామస్తులు సందర్శనలో ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

# బీసీ బిడ్డలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### ◆ బీసీల చిరకాల కోరిక 42 శాతం రిజర్వేషన్ ◆ జస్టిస్ ఫర్ బంద్‌కు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
### ◆ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జీవోలతో మభ్యపెడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ బిడ్డలను మోసం చేస్తున్నారని, బీసీ బిడ్డల చిరకాల కోరిక అయినటువంటి విద్య ఉద్యోగాలతో పాటు రాజకీయ పదవుల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు కావాలని చేస్తున్న పోరాటం, ఆ పోరాటం సాధన కొరకు బీసీ బిడ్డల జేఏసీ నేడు తలపెట్టిన జస్టిస్ ఫర్ బంద్ కు బిఆర్ఎస్ పార్టీ పక్షాన పూర్తి సహకారం ఉంటుందని, పెద్దపల్లి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ నేడు బీసీ సంఘాలు తల పెట్టిన జస్టిస్ ఫర్ బందులో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని బందు విజయవంతం చేయడంలో పాత్ర వహిస్తారని తెలిపారు. ఈ బంద్ సందర్భంగా నియోజకవర్గం లోని ప్రతి ఒక్కరు కూడా అనగా వ్యాపార వాణిజ్య వర్గాలు, పాఠశాలలు, కళాశాలలు, దుకాణ సముదాయాలు అన్నీ కూడా బీసీ బిడ్డలు తలపెట్టిన బందుకు మద్దతు తెలుపుతూ బందులో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ వైపు నుండి బీసీ బిడ్డల అభ్యున్నతి ధ్యేయంగా వారు తలపెట్టిన బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, ఈ కాంగ్రెస్ పార్టీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ బిడ్డలను మభ్యపెడుతూ వారిని మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్ రాజ్యాంగబద్ధంగా సాధించాల్సింది పోయి కేవలం జీవోలు ఇచ్చి మభ్యపెడుతూ ప్రజలను మాయలో ఉంచేటట్టు చేస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు ఆలోచనలతోటి ఎంతో కాలం బీసీ బిడ్డలను మోసం చేయలేరని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నిజంగా బీసీ బిడ్డలపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమ ఉన్నట్లయితే, బీసీల అభ్యున్నతికి, బీసీల జీవితాలలో వెలుగులు నింపేందుకు అవసరమైన బీసీ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే విషయంలో, రాజ్యాంగబద్ధంగా బీసీ బిల్లు సాధించే విషయంలో తమ కర్తవ్యం కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అప్పుడే బీసీ బిడ్డలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. బీసీ బిల్లు సాధించే విషయంలో చేయాల్సిన ప్రకారంగా చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్యపెట్టి, కాలం వెళ్లదీసే ఆలోచన చేస్తున్నందున దానిని తీవ్రంగా ఖండిస్తూ, రేపటి జస్టిస్ ఫర్ బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ముబీన్ఉద్దీన్, పెంచాల శ్రీధర్, ముఖిమ్, బొడ్డుపల్లి రమేష్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్‌లో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ

# అటెండర్ ప్రమీల తీరుపై మండిపడ్డ మాదిగలు





**మానకొండూర్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్)**: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్పిఎస్ నాయకులు శుక్రవారం దళితుల ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఆర్పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య మాట్లాడుతూ.....భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో దళిత జడ్జి బిఆర్ గవాయిపై ఒక లాయర్ బూటును విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లాయర్ ను తక్షణమే అరెస్ట్ చేసి దాడీ వెనకున్నోళ్ళపై కూడా శిక్షపడేలా సీనియర్ జడ్జితో విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ విజయ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. నిరసన తెలిపే క్రమంలో డప్పుకొట్టడం ఆపాలంటూ తహశీల్దార్ కార్యాలయ అటెండర్ ప్రమీల ఎంఆర్పిఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అందుడైన కనకం కొంరయ్యను గుడ్డోడా అంటూ నోరు జారడంతో అటెండర్ వ్యవహారంపై మాదిగలు మండిపడ్డారు. తహశీల్దార్లు మారుతున్నా అటెండర్ ప్రమీల మాటతీరు మారడంలేదని, కార్యాలయానికి వచ్చే వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపిస్తూ దళితులని కూడా చూడకుండా దుర్భాషలాడిన అంటెండర్ ప్రమీలను తక్షణమే విధుల నుండి తొలగించాలని తహశీల్దార్ ను కోరుతూ అటెండర్ తీరుపై త్వరలోనే కలెక్టర్, ఎమ్మెల్యేను కలువనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దండు వరలక్ష్మీ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపెల్లి పోలు, రామగిరి సుమన్, తాల్లపెల్లి శంకర్, కనకం కొంరయ్య, కనకం సమ్మయ్య, కొంకటి సమ్మయ్య, శివప్రసాద్, కిన్నెర శ్రీనివాస్, రవి, కనకం పెద్ద సమ్మయ్య, వెంకటేష్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

# రసమయి బూతుపురాణంపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు



**మానకొండూర్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం, గన్నేరువరం, ఇల్లంతకుంట మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లిని మాజీ ఎమ్మెల్యే రసమయి బూతులు తిడుతూ దూషణలకు పాల్పడడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రసమయి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రసమయి ఎమ్మెల్యేగా ఉన్న 10ఏండ్లలో నియోజకవర్గంలో ఒక్క దళిత కుటుంబం బాగుపడలేదని ఆరోపిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లి తల్లిపై దుర్భాషలాడడం రసమయి నీచ సంస్కృతికి నిదర్శనమని ఇలాంటి ప్రవర్తన వల్లే రసమయి గతంలో చెప్పుదెబ్బల పాలైయ్యాడని విమర్శించారు. ఎమ్యెల్యే కవ్వంపల్లికి రసమయి బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని లేదంటే నియోజకవర్గం నుండి తరిమి కొట్టడం తప్పదని నాయకులు హెచ్చరించారు. స్థానిక పోలీసులు దిష్టిబొమ్మ దగ్ధాన్ని విచ్చిన్నం చేసి నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నందగిరి రవీంద్ర చారి, గోపగోని బసవయ్య గౌడ్, ముస్కు ఉపేందర్ రెడ్డి, కొమటిరెడ్డి





భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిక స్వేచ్ఛకు సంకెళ్లు - ప్రజాస్వామ్యానికి చేటు

◆ పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ ◆ సాక్షి ఎడిటర్ పై వేధింపులకు నిరసనగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల నిరసన కార్యక్రమం ◆ సంఘీభావం ప్రకటించిన వామపక్ష పార్టీలు, బీఆర్ఎస్ నేతలు ◆ పత్రిక స్వేచ్ఛ పై దాడి హేయమైన చర్య: సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పత్రికలు స్వేచ్ఛగా పనిచేయగల సమాజంలోనే ప్రజాస్వామ్యం పరఢవిల్లుతుంది. అటువంటి ప్రతిక స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తే ప్రజాస్వామ్యానికి చేటు చేసినట్లేనని పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ అన్నారు. సాక్షి ఎడిటర్ పై ఏపీ పోలీసులు వేధింపులు, అక్రమ కేసులకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాజీవ్ రహదారిపై వివిధ ప్రజాసంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వానికి, ఏపీ పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విమర్శనాత్మకమైన, స్వతంత్రమైన, పరిశోధనాత్మకమైన పత్రిక స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామిక రాజ్యానికైనా జీవనాడి వంటింది అని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నెల్సన్ మండేలా చెప్పారన్నారు.ప్రజాస్వామ్యానికి మూల స్తంభాల్లో ఒకటైన మీడియా ప్రతిపక్ష పాత్ర పోషించడం సర్వసాధారణమని,ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నారనే కక్షతో సాక్షి పై కత్తికట్టి, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి పై పోలీసుల వేధింపులు చేయటం సరికాదన్నారు.పత్రికల్లో సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రచురిస్తుంటారని దానిపై ప్రభుత్వానికి ఏవైనా అభ్యంతరాలుంటే వివరణ ఇవ్వాలి తప్ప కేసులు బనాయించి బెదిరించాలని చూడటం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. బీఎన్ఎస్ 179(1) వంటి అసంబద్ధమైన సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వటం, సోర్స్ వివరాలను అడగటం వంటి చర్యలు అధికార దుర్వినియోగం పరిధిలోకి వస్తాయని సుప్రీకం కోర్టు రోమేష్ థాపర్, అర్ణబ్ గోస్వామి, న్యూస్‌క్లిక్ కేసులల్లో సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. ఐన ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న ధోరణులు హిట్లర్, ముస్సోలిని లాంటి నియంత పోకడలను తలపిస్తూ మీడియా గొంతుకను నొక్కాయాలని చూస్తున్న ప్రభుత్వ వైఖరిని ముక్తకంఠంతో ఖండించటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇది కేవలం సాక్షి సమస్య కాదు. ఈరోజు ఇది సాక్షికి సమస్య కావచ్చు. పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు మేల్కొనకోకపోతే ఇది రేపు అందిరికి, ముఖ్యంగా ప్రజాస్వామ్యంకు పెనుసమస్యగా పరిణమిస్తుందన్నారు. అందుకే పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ తరుపున ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛ పై దాడి చేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పత్రికలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వం చేసే తప్పిదాలను ఎత్తి చూపితే ప్రభుత్వం దాడులు




చేసి భయభ్రాంతులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. సుప్రీం కోర్టు గైడ్ లైన్సుకు విరుద్ధంగా పత్రికల్లో వచ్చిన వార్తల సోర్సు వివరాలు అడగడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. సాక్షి ఎడిటర్ పై కక్ష సాధింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. విచారణ పేరుతో సాక్షి కార్యాలయాల్లో పోలీసులు హల్చల్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. ఈకార్యక్రమంలో ఆరెల్లి మల్లేష్, ఎర్రోజు వేణుగోపాల్ , బెజ్జంకి నరేష్ ,కాల్వ రమేష్, ముద్దసాని సమ్మయ్య, మొత్కూరి శ్రీనివాస్, కీర్తి రమేష్, లైశెట్టి రాజు, కేతిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఆరుకుటి మల్లేష్ యాదవ్, అడ్డగుంట రాజేందర్, మర్రి సతీష్‌రెడి,కొయ్యాడ తిరుపతి,మొగిలి, కత్తెర్ల చందర్, మేకల సంతోష్, వెంకటేష్ , మరుపాక అంజయ్య, సంకే రాజు, తోట సతీష్, చందర్, ప్రసాద్ , దొమ్మటి రాజేష్, నల్లాపు తిరుపతి, తిరుమల సురేష్, నాగపూర్ తిరుపతి, హరిప్రసాద్, మామిడాల కుమార్, గాదె బాలయ్య, తాళ్ల రమేష్, గుర్రం వంశీ, జంగ సంపత్ యాదవ్, గొర్రె తిరుపతి, ముంజే శ్రీనివాస్, అమర్, శ్రీనివాస్, బాలయ్య, వినయ్, కుమార్, శ్రీనివాస్, వామపక్ష నాయకులు కల్లేపల్లి అశోక్, సీపల్లి రవీందర్, మానస్ కుమార్, బీఆర్ఎస్ నేతలు ఉప్పు రాజ్ కుమార్, పెంచల శ్రీధర్, బొడ్డుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పట్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కపట ప్రేమ

◆ బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు: పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణరావు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న నేడు బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని శుక్రవారం రోజున కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణరావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణరావు మాట్లాడుతూ బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పెరగాలని బీసీ కుల గణన నిర్వహించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ నినాదంగా పెట్టుకుందని చెప్పారు. 18న నేడు జరిగే బందులో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ ఆమోదానికి పంపితే తగిన స్పందన రాలేదని తెలిపారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించినప్పటికీ కేంద్రం నుండి ఫలితం శూన్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ల పెంపు పట్ల ఇష్టం లేదన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది మంది ఎంపీలు, ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బిల్లు ఆమోదానికి గవర్నర్ ను



ఒప్పించలేకపోతున్నారని తెలిపారు. బిజెపి తీరు ఇలా ఉండగా, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి బీఆర్ఎస్ పార్టీ తగ్గించిందని, ప్రస్తుతం ఈ రెండు పార్టీలు బీసీల పట్ల చూపుతున్న కపట ప్రేమను ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి,కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు గజనావేన సదయ్య, ఓదెల మల్లికార్జున స్వామి డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య ,ఎంపీపీ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లెదర్ ఇండస్ట్రీస్ పార్కులను వెంటనే పునరుత్పాదించాలి

- చర్మకార సంఘం అధ్యక్షులు మోతే స్వామి - రేపటి బీసీ తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు - మాదిగ హక్కుల దండోరా..

**జమ్మికుంట అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట గాంధీ చౌరస్తాలో లెదర్ పార్క్ సాధన చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ పాల్గొన్నారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రతిపాదికన లెదర్ పార్కులను పునరుత్పాదించి అందుబాటులోకి తీసుకురావాలి. సుమారు 11 సంవత్సరాల కిందట చర్మకారుల, దళితుల అభివృద్ధి కోసం లెదర్ పార్కులను ఏర్పాటు చేయడానికి అప్పుడున్న ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి , తద్వారా లెదర్ పార్కుల నిర్మాణం కోసం ఉమ్మడి పది జిల్లాలలో స్థలాలు కేటాయించబడ్డాయి కానీ అవి తెరుచుకోవడానికి మాత్రం ముహూర్తాలు ఖరారు కాలేదు,ఇంకా కొన్ని నిర్మాణం జరగలేదు. ఇందులో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాల కారణంగా ఒకరి మీద ఒకరు సాకులు చెప్పి తప్పించుకున్నారు తప్ప లెదర్ పార్కులో ఏర్పాటు కోసం ముందడుగు వేయడం లేదు . పాలకులకు కావాల్సింది కమిషన్లు తప్ప తెలంగాణ ప్రాంత అభివృద్ధి కాదు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. వేరే రాష్ట్రాల నుండి దేశాల నుండి దిగుమతి తీసుకుంటే ఒక రేటు మాట్లాడుకుని తద్వారా పాలకులు లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయి కానీ దాని ఉత్పత్తి మన రాష్ట్రంలో మన దేశంలో జరిగితే దిగుమతి చేసుకోవడానికి అవకాశం ఉండదు వాళ్లకు కమిషన్లు రావు. దళితులు డెవలప్ అయితే వాళ్లకు సమస్యలు ఉండవు పాలకుల దగ్గరికి రారు, వాళ్ళు చెప్పినట్టు వినరు కాబట్టి ఈ సమస్యలు పరిష్కారం చేయరు దీనికి మూలం ఎక్కడ ఉందని మీరంతా ఆలోచన చేయాలి ద్రోహులు ఎవరో గుర్తించాలని మీ అందరికీ తెలియజేస్తున్నాము. ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద 20% నిధులు కేటాయించి వెంటనే ఓపెన్ చేయలి. కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నాము అందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మేము కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము ఇప్పటికే చాలా చోట్ల లెదర్ పార్క్ కోసం కేటాయించిన స్థలాలు దోపిడీదారులతో కబ్జాకు గురవుతున్నాయి కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వీటిని పునరుత్పాదించాలి. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లలో,ఏటీసీ సెంటర్లో, ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో లెదర్ టెక్నాలజీ ఒక కోర్సుగా ప్రవేశపెట్టి ఆధునిక శిక్షణ కోసం ప్రభుత్వం సహకరించి, ప్రోత్సాహాన్ని అందించాలి. లెదర్ పార్కులలో చర్మకారులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.అదేవిధంగా ఈ లెదర్ పార్కుల విషయమై రాష్ట్రంలో ఉన్న





కేంద్ర ప్రభుత్వ మంత్రులను కలిసి చర్చిస్తామని అయినప్పటికీ పరిష్కారం లభించకపోతే తర్వాత ఆ పోరాట భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రేణికుంట్ల కుమార్, హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డే రాజేంద్రప్రసాద్ , ఇల్లంతాకుంట ఎంహెచ్పి అధ్యక్షులు రేణికుంట్ల జాన్, ఇల్లంతకుంట గౌరవ అధ్యక్షులు స్వామి దాసు, చర్మకార సంఘం అధ్యక్షులు మోతే స్వామి,ఉపాధ్యక్షులు మారేపల్లి పోశెట్టి, కార్యదర్శి శనిగరపు సంపత్, వంతడుపుల కొమరయ్య శనిగారపు శ్రీనివాస్, సముద్రాల రవి, ఎం లక్ష్మణ్ దాసరి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు, కళాశాలలు నడపడానికి అన్ని రకాల ధృవీకరణ పత్రాలు తప్పనిసరి

- అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ




**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని పాట శాలలు , కళాశాలలు విద్యా సంస్థ నడపడానికి కావలసిన నిరభ్యంతర ధృవీకరణ పత్రం ( ఎన్ ఓ సి ) తో పాటు పారిశుద్ధ్య ధృవీకరణ పత్రం ( శానిటేషన్ సర్టిఫికేట్ ) తప్పనిసరిగా కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబందించి ఇంకా ధృవీకరణ పత్రాలు పొందని విద్యా సంస్థల నిర్వాహకులు నిర్ణీత ధరఖాస్తు ఫారం పూరించి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి ఒక్కొక్క ధృవీకరణ పత్రానికి రూ . 10,000/- రుసు%శీ% చెల్లి%శీ%చి నగర పాలక సంస్థ కార్యాలయంలో సమర్పించినట్లయితే క్షేత్ర స్థాయిలో పరిశీలించి జారీ చేయడం జరుగుతుందని అన్నారు. తనిఖీలు నిర్వహించినప్పుడు చెల్లుబాటులో ఉన్న ఎన్ ఓ సి, శానిటేషన్ సర్టిఫికేట్ లేనట్లయితే జరిమానా విధించడంతో పాటు సదరు విద్యా సంస్థపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కావున విద్యా సంస్థల నిర్వాహకులు సకాలంలో ధృవీకరణ పత్రాలు పొంది సహకరించాలని కోరారు.

# పలు కార్యక్రమాలలో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్

**పరిశ్రమ ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్‌ని కలిసిన పృథ్వీరాజ్**




**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** పఠాన్ చేరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న పృథ్వీరాజ్. సుల్తాన్‌పూర్ పరిధిలో ఉన్న మెడికల్ డివైసెస్ పార్క్‌లో హువెల్ లైఫ్ సైన్స్ సంస్థ కొత్త కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించడానికి వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసాను. కేటీఆర్ తో కొద్దిసేపు ముచ్చటించినట్టు తెలిపిన పృథ్వీరాజ్, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వచ్చే పంచాయతీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ గెలుపు ఖాయం కార్యకర్తలందరూ సమిష్టితో కృషి చేయాలని కేటీఆర్ తెలిపారని మధురి పృథ్వీరాజ్ అన్నారు కేటీఆర్ మాటలను తప్పకుండా పాటిస్తాం పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం మదిరి పృథ్వీరాజ్.

# పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ప్రారంభం...

- విద్యార్థులు సరైన లక్ష్యం నిర్ధేశించుకోవాలి - డివైఎస్ఓ అక్కపాక సురేష్

- ఎ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, ఎంఈఓ రాజయ్య





**సుల్తానాబాద్, అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని పెద్దపల్లి జిల్లా డివైస్ ఓ అక్కపాక సురేష్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్,ఎంఈఓ రాజయ్య అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాల నుంచి 100 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతొ పాటు క్రీడల్లో రాణించాలని,లక్ష్యం దిశగా ముందుకు సాగాలని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి దాసరి రమేష్, సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీ వ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు పిడి ప్రణయ్, వెంకటేష్, సత్యం, శివ, స్వప్న, సతీష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు..



**హుజురాబాద్ అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** శనివారం రోజున బీసీ సంఘాలు ఇచ్చిన తెలంగాణ బంద్ కు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ తరుపున మద్దతు తెలుపుతున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో బీసీ డిక్లేరేషన్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం అమలు చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని పూర్తి చేశామని, ఈ మేరకు ప్రభుత్వం ఇంటింటి కులగణన సర్వేను పక్కగా చేశామని, అనంతరం శాసనసభలో బీసీ బిల్లులను ఆమోదించామని,లోకల్ బాడీ ఎన్నికల్లో వాటిని అమలు చేసేందుకు ప్రత్యేక జీవో కూడా విడుదల చేశామని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే గవర్నర్, రాష్ట్రపతి దగ్గరికి పంపిన బీసీ బిల్లులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మాత్రమే ఉందని దానికోసం కోర్టులో కూడా బలమైన వాదనలు వినిపించామనీ అన్నారు.

## సార్లు స్పందించారు
## తుమ్మలు, పిచ్చి మొక్కలు తొలగింపు





**రామగిరి, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్-రాంనగర్ మధ్య ఉన్న ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన పెరిగిన తుమ్మలు పిచ్చి మొక్కలను శుక్రవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. స్పెషలాఫీసర్, సెక్రటరీల పాలనాలో దసరా ఐ పోయింది కానీ దీపావళి వస్తుందని కనీసం గ్రామంలో రోడ్ల పక్కన తుమ్మలు, పిచ్చి మొక్కలు భారీగా చేరాయని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీరావు ఫొటోలతో వాట్సప్ గ్రూపులలో విన్నవించారు. అధికారులు స్పందించి ఏదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని ప్రమాదాలు జరుగుతున్నాయని జరా వీటిని తొలగిస్తారా అని కోరడం జరిగిందని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీరావు వాట్సప్ గ్రూపులలో విన్నవించగా దీనికి స్పందించిన స్పెషలాఫీసర్, మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, గ్రామ పంచాయితీ కార్యదర్శి గంగుల సంతోష్ లు జే.సీ.బీ ద్వారా వీటిని తొలగించారు.

## ఆల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు




**సుల్తానాబాద్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్:** చీకటిని నిర్మూలించి వెలుగులను నింపి విజయనందించిన పండుగ దీపావళి పండుగ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగకు ఎంతో విశిష్టత ఉందని పురాతన కాలం నుంచి దీపాలు వెలిగించడంతో ఆ ఇంట్లో సిరిసంపదలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులచే లక్ష్మీదేవి పూజతో పాటు దీపావళి విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్ష..






**జమ్మికుంట అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అద్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 77 మంది పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి, అవసరమగు వారికి ఆపరేషన్ కోసం సిఫారసు చేశారు. మరికొంత మందికి ఐ డ్రాప్స్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న దుమ్ము ధూళి వల్ల, వయస్సు పైబడిన చూపు మందగించే వారందరికీ ఈ కంటి పరీక్ష ఉపయోగ పడుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటూ పట్టణ సుందరీకరణకు పాటు పడుతున్నవారిలో ముందు వరుసలో ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, ఐ హాస్పిటల్ వైద్యులు, కోఆర్డినేటర్‌నవీన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గుల్జార్ మస్జిద్ లో భక్తి శ్రద్ధలతో గ్యారిమి షరీఫ్..

**జమ్మికుంట అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** ముస్లింల పవిత్ర మాసమైన రబ్బీ ఉల్ సాని లో ముస్లింలు జరుపుకునే గ్యారిమి షరీఫ్ (జెండా పండుగ )ను జమ్మికుంట పట్టణంలోని గుల్జార్ మస్జిద్ లో శుక్రవారం రోజున భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులకు అన్నదానం చేసినారు.హజ్రత్ గౌసే ఆజమ్ దస్తగీర్ రహమతుల్లాహ్ అలై తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు, ఇస్లాం బోధనలు, బాధితుల పట్ల చూపించిన కరుణ,దయ వల్ల ఎంతోమంది సుఖశాంతులతో జీవనం గడపగలిగారు. ప్రతి ఏటా వీరి స్మారకర్థం జరుపుకునే పండుగ గ్యారిమి షరీఫ్. గ్యారీమీ షరీఫ్ సందర్భంగా జెండాను గుల్జార్ మస్జిద్ వద్ద ఉన్న జెండా గద్దెలో ప్రతిష్టించారు. మత గురువు మౌలానా జహీరుల్ ఖాద్రి చదివి వినిపించిన ఖురాన్ లోని సూక్తులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గుల్జార్ మస్జిద్ అధ్యక్షుడు ఎంఏ హుస్సేన్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ సలీం, కార్యదర్శి అబ్బాస్, కోశాధికారి మొహమ్మద్ అక్బర్,రజా యూత్ సభ్యులు మహమ్మద్ జానీ, పర్వేజ్, చాంద్, పాష, యూనుస్, రషీద్, హీసాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీల పట్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కపట ప్రేమ..

◆ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్ ):** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని శుక్రవారం రోజున కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... బిసి లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పెరగాలని బీసీ కుల గణన నిర్వహించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ నినాదంగా పెట్టుకుందని చెప్పారు. 18న జరిగే బందులో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ ఆమోదానికి పంపితే తగిన స్పందన రాలేదని తెలిపారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించినప్పటికీ కేంద్రం నుండి ఫలితం శూన్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ల పెంపు పట్ల ఇష్టం లేదన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది మంది ఎంపీలు, ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బిల్లు ఆమోదానికి గవర్నర్ ను ఒప్పించ లేకపోతున్నారని తెలిపారు. బిజెపి తీరు ఇలా ఉండగా, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి బీఆర్ఎస్ పార్టీ తగ్గించిందని, ప్రస్తుతం ఈ రెండు పార్టీలు బీసీల పట్ల చూపుతున్న కపట ప్రేమను ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షులు గజనావేన సదయ్య, ఓదెల మల్లికార్జున స్వామి డైరెక్టర్లు , మార్కెట్ డైరెక్టర్లు మాజీ జడ్పీటీసీ లంక సదయ్యలు, ఎంపీపీ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్......

**తిమ్మాపూర్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వీదుల్లో తనిఖీలు చేసి పాత నేరస్థుల వివరాల సేకరణకై అద్దెఇండ్లను ఆరాతీశారు. సరైన ధృవపత్రాలు లేని 117 ద్విచక్ర వాహనాలు, 7ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరానికి గురైనట్లయితే 1930కు సమాచారం అందించి సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణా, చట్టరిత్యా నేరమని స్పష్టం చేస్తూ వాటితో కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తులపైనా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డయల్ 100కు గాని స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని సూచించి షీ టీం, టి సేఫ్ యాప్ పై అవగాహన కల్పించారు. జాతియ రహదారిని ఆనుకునే రామకృష్ణ కాలనీ ఉన్నందున రోడ్డు ప్రమాదాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. నేరాలను అరికట్టడంలో సిసి కెమెరాల ప్రాముఖ్యతను వివరించగా ఊరి భద్రత కోసం గ్రామపెద్దలు 55 కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు సీపీ గౌస్ ఆలం తెలిపారు. ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్లు సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్, శ్రీలత, పుల్లయ్య, సరిలాల్, ఎల్.ఎం.డి. పోలీస్ స్టేషన్ ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్ సిబ్బంది సిపితో పాటు కార్డెన్ సెర్చ్ లో పాల్గొన్నారు.






# బీసీ బంద్‌కు మద్దతుగా భారీ మోటర్ సైకిల్ ర్యాలీ

**చిగురుమామిడి (ది క్రైమ్ న్యూస్):** చిగురుమామిడి మండల కేంద్రంలో బీసీ జేఏసీ బంద్ కు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో బీసీ చైతన్య ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 150 మోటర్ సైకిల్లు మండల కేంద్రం నుండి బయలుదేరి అన్ని గ్రామాలలో తిరుగుతూ బీసీ చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్లు అమలు అయ్యే విధంగా చూడాలన్నారు.ఏ రాజకీయ పార్టీ ఐన, ఏ నాయకుడైన బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేక విధానాలను అవలంబిస్తే రాజకీయంగా పాతర వేయడం ఖాయమన్నారు. బీసీల భవిష్యత్తు కోసం, జాతి అభివృద్ధి కోసం, ఆత్మ గౌరవం కోసం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేంత వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈనెల 18న రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు విద్యా ఉద్యోగ వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బందులు పాటించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు శ్రీ రామోజీ రాజ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ల పెల్లి తిరుపతి గౌడ్, మండల యూత్ అధ్యక్షులు గుడిసె మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి గట్టు ప్రశాంత్, పెసరి శ్రీనివాస్, ముంజ వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షులు శిరవేణి సంపత్, బరిగల సదానందం, మూసాపూరి సంపత్, పెసరి మొగిలి, పిల్లి కొమురయ్య, కందుకూరి శ్రీనివాస్, బింగి రాజేంద్రప్రసాద్, గుడిసె ఓదేలు, కూన తిరుపతి, దంచనోజుచంద్రశేఖర్, మండల నాయకులు మూల శ్రీనివాస్, కూరల కిషోర్, చొప్పదండి సాయి, పొన్నం రాజు, నల్గొండ దశరథం, పిట్టల రాజు తదితరులు పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్‌ను అడ్డుకునేది బిజెపి ప్రభుత్వమే

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు



**(ది క్రైమ్ న్యూస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకమాడుతున్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు విమర్శించారు. ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇచ్చిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో పాల్గంటామనీ, లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో బీసీ సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు భాగస్వాములు కావాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కార్యాలయం సీపీఐ(ఎం) శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. ఆర్నెల్లైనా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసిందన్నారు. ఆ జీవోపై హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. ఆ స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే ఆ పిటిషన్‌ను తిరస్కరించిందని వివరించారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకోవాలంటూ సూచించిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందనీ, అన్ని రాజకీయ పార్టీల మద్దతునూ కోరిందని చెప్పారు. ఈ బంద్‌కు బీజేపీ కూడా మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందనీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత బిజెపి పార్టీపైనే ఉందని అన్నారు. కాంగ్రెస్ కూడా బంద్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్రబంద్ ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలున్నారని వివరించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ప్రజాప్రతినిధులు అడుగుతారా?అని ప్రశ్నించారు. బీసీ జేఏసీ నేతలు ఆలోచించాలనీ, కేంద్రం తీరుకు వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించాలనీ, కేంద్రంపై పోరాడాలని సూచించారు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంలో సీపీఐ(ఎం) మద్దతునిస్తుందని చెప్పారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వడంతో ప్రజలకు సరైన దిశ ఉండబోదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18న బీజేపీకి వ్యతిరేకంగా బంద్ చేపడితే పాల్గంటామనీ, లేదంటే అదేరోజు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండలాలు, పట్టణాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, బైక్ యాత్రలు నిర్వహిస్తామనీ, కేంద్రం తీరును నిరసిస్తామని అన్నారు. ఇందులో బీసీ సంఘాలు, అభ్యుదయ సంఘాలు, ప్రజాతంత్రవాదులు పాల్గనాలని కోరారు. బీసీ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం బీజేపీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకునే రాజకీయ పార్టీని అందరూ గుర్తించాలని సీపీఐ(ఎం) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. ఈ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. ఆ పార్టీకి, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్ జరగాలన్నారు. బీజేపీ ఉన్న వేదికల్లో తాము పాల్గనేది లేదని స్పష్టం చేశారు. తాము స్వతంత్రంగా ఉద్యమాలను చేపడతామని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అఖిలపక్షం సహకారంతో ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, పోలేం రాజేందర్, గుర్రం దేవేందర్, ఆకుదారి రమేష్, గడప శేఖర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు సిపిఆర్ పై అవగాహన..

**జమ్మికుంట అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రావారం సిపిఆర్ పై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్.వో డాక్టర్ చందు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సులో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ వో చందు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉన్న అంటూ ధీమాగా ఉండకుండా వైద్యులు సూచించిన బీపీ, షుగర్ వంటి టాబ్లెట్ లు వేసుకునే వారు ప్రతి రోజు ఉపయోగించాలని, ప్రతి 15-30 రోజులకు ఒకసారి వైద్యునితో పరీక్షలకు నిర్వహించు కోవాలని వారు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించబడుతాయని, విధిగా పరీక్షలు చేసుకొని, మందులు ఉపయోగించాలని వారు అన్నారు. సఫాయి కార్మికులు ప్రతి మున్సిపాలిటీకి సిపాయిగా పని చేస్తారని, ప్రతి ఒక్కరు సిపిఆర్ పై అవగాహన కల్గి ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. కార్డియోపల్మనరీ రీసస్టిటేషన్ (సిపిఆర్) పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తుల ప్రాణాలను ఎలా కాపాడగలమో అనే విషయాన్ని గ్రహిస్తే ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించుటకు వీలు కలుగుతుందన్నారు. గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స గుండెపోటు, అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ చేయడం చాలా ముఖ్యమైన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం వైద్యుడు తులసీదాసు కార్మికులకు నిశితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పంజాల ప్రతాప్ గౌడ్, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, హెల్త్ సూపర్ వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, పారిశుధ్య జవాన్లు, కార్మికులు పలువురు పాల్గొన్నారు.






# తెలంగాణ బంద్‌లో కరీంనగర్ బీసీ కులస్తులంతా పాల్గొనాలి

◆ బీసీల ఉద్యమాలన్నింటికీ బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుంది ◆ సింగిల్ విండో చైర్మన్ పొనగంటి సంపత్

**జమ్మికుంట సెప్టెంబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణ ఎంపిఆర్ గార్డెన్ లో సింగిల్ విండో చైర్మన్ పొనగంటి సంపత్ కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్ మాజీ ఎంపిటిసి తోట లక్ష్మణ్ లు మాట్లాడుతూ రేపు జరగబోయే బీసీ రిజర్వేషన్ తెలంగాణలో బిసి జేఏసీ ప్రకటనతో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం అమలు కాకుండా జరుగుతున్న కుట్రలను నిరసనగా బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ బంద్ పాటించాలి. మొత్తం రిజర్వేషన్లు 50% దాటవద్దు అనే కుంటి సాకుతో బీసీలకు అన్యాయం చేస్తున్నారు.దేశంలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలు కూడా పేదరికంలో మగ్గుతున్నారు. సామాజిక వెనుకబాటుకు గురవుతున్నారు. అలాంటప్పుడు వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడంలో తప్పు ఏమిటి? 10 శాతం జనాభా ఉన్న ఓసీలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించినప్పుడు అడ్డురాని 50% నిబంధన... బీసీల విషయంలో ఎందుకు వస్తుంది? మొత్తంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై జరిగే అన్ని పోరాటాలకు అన్ని కుల సంఘం అండగా ఉంటుంది. 18 జరిగే రాష్ట్ర బంద్ లో అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాను. బీసీ కులాలు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద- సామాజిక సేవ కార్యకర్తలు, వివిధ సంఘాల్లో పనిచేస్తున్న నాయకులు ఈ బంద్ లో పాల్గొని బీసీ ఉద్యమాలకు అండగా నిలవాలని మనవి చేస్తున్నాను. రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే బీసీ ఉద్యమాల్లో బి ఆర్ ఎస్ పార్టీ ఒక ప్రధాన పాత్ర పోషించబోతుందనే విషయాన్ని కూడా మీకు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో పొనగంటి సంపత్. బొద్దుల రవీందర్. తోట లక్ష్మణ్. సైదాబాద్ మాజీ సర్పంచ్ రాజారాం మడిపల్లి మాజీ సర్పంచి పరశురాములు గౌడ్ యోబుసి కౌశిక్ . దయ్యాల శ్రీనివాస్.ఆకుల నారాయణ. పొనగంటి సందీప్. పొనగంటి శ్రీధర్. నీరటీ సతీష్. మొగిలి. పనికర్ రమేష్ పొనగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# తూకంలో మోసం లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తాం


◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**శంకరపట్నం, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు, గద్దపాక, తాడికల్, కేశవపట్నం గ్రామాల్లో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..... తేమ పేరుతో తూకంలో మోసాలకు తావులేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులతో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు.నిర్ణీత గడువులోగా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చామని, ధాన్యాన్ని బాగా ఆరబెట్టి నాణ్యతా పాటిస్తూ ప్రభుత్వం పెంచిన మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి రైతులను కోరారు. కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, జిల్లా కార్యదర్శులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి, గట్టు తిరుపతి గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవ్వ పద్మ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, తాడికల్, గద్దపాక, మెట్ పల్లి గ్రామాల సింగిల్ విండో అధ్యక్షులు మధుకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, నాయకుల బండారు తిరుపతి, మొలంగూరు సదానందం, కీసర తిరుపతి, శంకర్ రెడ్డి, తాడిచర్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## - కలెక్టర్ బి. సత్యప్రసాద్



**ధర్మపురి, అక్టోబర్ 17, (ది క్రైమ్ న్యూస్):** భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున ధర్మపురి తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్లను త్వరిత గతిన ప్రజలకు అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పునఃనిర్మాణం పనులకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, ధర్మపురి మండల ఎమ్మార్వో శ్రీనివాస్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ పదనిఘంటువు పుస్తకావిష్కరణ కార్యక్రమం

## - తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ప్రత్యేక కార్యక్రమం



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, హైదరాబాదులో తెలుగు శాఖ ఆధ్వర్యంలో "తెలంగాణ పదనిఘంటువు" పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ నిఘంటువు ప్రత్యేకత ఏమిటంటే ა విద్యార్థులే తెలంగాణ ప్రాంతీయ పదాలను సేకరించి, వాటిని సమగ్రమైన రూపంలో ఒక పుస్తకంగా రూపొందించారు. ఈ కృషి విద్యార్థుల భాషాప్రేమను, సాహిత్యంపై ఆసక్తిని ప్రతిబింబించింది. కార్యక్రమానికి ప్రముఖ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ა "తెలంగాణ భాషలో ఉన్న సొగసు, భావప్రకాశం, జీవనతీరు ప్రతిబింబించే పదాలను భద్రపరచడం గొప్ప సాహిత్య సేవ" అని విద్యార్థులను అభినందించారు. అలాగే ఈ కార్యక్రమానికి సిహెచ్.వి.వి సాయిప్రసాద్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ప్రొఫెసర్ కె. కరుణాదేవి ప్రిన్సిపల్, ప్రొఫెసర్ వై. వసుంధర వైస్ ప్రిన్సిపల్, డాక్టర్ ఏ. ప్రమీల కోఆర్డినేటర్, ఎం. అలివేణి తెలుగు శాఖాధ్యక్షులు, ఎం. కీర్తన తెలుగు అధ్యాపకురాలు, ఫ్యాకల్టీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. కరుణాదేవి గారు మాట్లాడుతూ, విద్యార్థుల శ్రమతో రూపుదిద్దుకున్న ఈ నిఘంటువు భవిష్యత్తులో భాషా అధ్యయనానికి ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, చివరగా విద్యార్థులు మరియు అధ్యాపకులు కలిసి జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఎం అలివేణి గారి కృషి ఫలితమే ఈ "తెలంగాణ పద నిఘంటువు"విద్యార్థుల చేత అంతరించిపోతున్నటువంటి పదాలను సేకరింపజేసి వాటికి కల్పించిన ఒక పుస్తక నిర్మాణమే ఈ "తెలంగాణ పదనిఘంటువు".



# బిసిల తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతం చేయండి..

## - రాష్ట్ర బీసీ కార్మిక సేవా సంఘం అధ్యక్షుడు సిహెచ్. రమేష్ గౌడ్



**శామీర్‌పేట, అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** నేడు చేపట్ట తలపెట్టిన తెలంగాణ బందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర బీసీ కార్మిక సేవా సంఘం అధ్యక్షుడు సిహెచ్. రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. నేటి బిసి సంఘాలు చేపట్టిన తెలంగాణ బందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, ఎంఆర్పిఎస్, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42% ఇవ్వడం న్యాయమైన డిమాండ్ అని తెలిపారు. కొద్దిమంది ఉన్న అగ్రకుల నాయకులు బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం చాలా బాధాకరమని ఆగ్రహం చెందారు. బీసీలు అంతా ఏకమై గల్లీ నుండి ఢిల్లీ వరకు సెగ పుట్టించాలని చెప్పారు. 130 బీసీ కుల సంఘాలు రాష్ట్ర బందుకు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్ వ్యతిరేకలను ఎండగట్టి తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ సాధన కోసం ఈ బందు చేపట్టడం జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం ద్వారా రాష్ట్రంలో అన్ని కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, అంతిమంగా రాజ్యాధికారంలో బీసీలకు దామాషా ప్రకారం వాటా దక్కుతుందని అన్నారు. సుప్రీం కోర్టులో సానుకూల నిర్ణయం వచ్చేలా అడ్డంకులన్నిటిని అధిగమించే విధంగా అవసరమైతే పార్లమెంటులో చట్టం అయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం తన వంతు పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ వచ్చే వరకు అన్ని రాజకీయ పార్టీలు పోరాడాలని కోరారు. బీసీలు అంటే అన్ని రాష్ట్రాలకు భయం పుట్టే విధంగా పోరాటం చేయాలని, నేడు అందరూ బందుకు సహకరించాలని కోరారు అన్ని కుల సంఘాలు బందుకు మద్దతు ఇవ్వాలని కోరారు ఇది మన బీసీల పోరాటం పోరాటం ద్వారా సాధ్యము కానిది ఏమీ లేదని పేర్కొన్నారు దయచేసి అందరూ బందుకు సహకరించాలని మరొకసారి కోరారు.

# దిష్టిబొమ్మ దగ్దం.... కాంగ్రెస్ నాయకుల అరెస్ట్



**మానకొండూర్, అక్టోబర్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లిపై మాజి ఎమ్మెల్యే రసమయి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం నిరసన చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. గంగిపెల్లి ఎంపీటీసీ చలిగంటి సంపత్, గట్టుదుద్దేనపల్లి కాంగ్రెస్ అధ్యక్షులు కనకం కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చలిగంటి ఓదెలు, కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాంద్రాల కనకరాజేశం, మాజీ సర్పంచ్ గాడిచర్ల కొమరయ్య, నీరటి మొగిలి, బుర్ర చంద్రాకర్ గొల్లెన కొమురయ్య, బొంగుని సునీల్ గౌడ్, బాకారపు రమేష్, రామకృష్ణ, జీనుక అనిల్, బనక తిరుపతి, మొగులయ్య తదితరులు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.

## గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..

యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడంచాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. . అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

# రిటైర్మెంట్ వారి వ్యక్తిగత నిర్ణయం..

## టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్



టీమిండియా స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆకస్మికంగా టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడం అప్పట్లో అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇంగ్లండ్ పర్యటనకు ముందే ఈ ఇద్దరూ వారం వ్యవధిలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం అనేక సందేహాలకు దారి తీసింది. ముఖ్యంగా ఇంగ్లండ్ పర్యటనకు సిద్దంగా ఉన్నానని రోహిత్ చెప్పిన కొద్ది రోజులకే అతను ఆటకు టాటా చెప్పడం మరిన్ని అనుమానాలను రేకెత్తించింది. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనలతోనే ఈ ఇద్దరూ ఆట నుంచి తప్పుకున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్‌పై ఎవరూ క్లారిటీ ఇవ్వలేదు.తాజాగా టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ప్రశ్నించగా ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. కోహ్లీ, రోహిత్‌లను తాము ఇంగ్లండ్ పర్యటనలో ఆడించాలనుకున్నామని, కానీ వారే ఆటకు వీడ్కోలు పలికారని చెప్పాడు. రిటైర్మెంట్ వారి వ్యక్తిగత నిర్ణయమని, ఎవరి ఒత్తిడి లేదని స్పష్టం చేశాడు.కోహ్లీ, రోహిత్ టీమిండియాకు రెండు పిల్లర్స్. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 27 కొత్త ఎడిషన్ ప్రారంభమవుతుండటంతో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని ఈ ఇద్దరూ భావించారు. రిటైర్మెంట్ వారి వ్యక్తిగత నిర్ణయం. నిజం చెప్పాలంటే ఇంగ్లండ్ పర్యటనలో అనుభవం కలిగిన కోహ్లీ, రోహిత్ ఉండాలనుకున్నాం. ఈ సిరీస్ గెలవకపోయినా శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని యువ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది.'అని అగార్కర్ చెప్పుకొచ్చాడు.అయితే రిటైర్మెంట్ ప్రకటించకుండా కోహ్లీ, రోహిత్‌లను కన్విన్స్ చేసే ప్రయత్నం చేశారా? అంటే సమాధానం చెప్పేందుకు గవాస్కర్ నిరాకరించాడు. అది సీక్రెట్ అని, చెప్పనని తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనకు 15 రోజుల ముందు ఈ సిరీస్ గురించి రోహిత్ శర్మ చేసిన పోస్ట్ గురించి ప్రస్తావించగా.. తనకు తెలియదని అగార్కర్ బదులిచ్చాడు. తాను ఆటగాళ్లతోనే మాట్లాడుతానని, సోషల్ మీడియ పోస్ట్‌ల గురించి తనకు తెలియదన్నాడు. రిటైర్ అయిన ఆటగాళ్ల గురించి మాట్లాడే బదులు.. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన కనబర్చిన జట్టు గురించి మాట్లాడుదామని హితవు పలికాడు. జట్టులో పాత ఆటగాళ్లు పోయి కొత్త ప్లేయర్లు రావడం సహజమని అగార్కర్ అభిప్రాయపడ్డాడు.'సీనియర్ ఆటగాళ్లు రిటైర్ కావడం.. యువ ఆటగాళ్లు జట్టులోకి రావడం సహజం. ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. 200 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సచిన్ కూడా ఆట నుంచి తప్పుకున్నాడు. అది ఆట స్వభావం. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా మార్పు ఉండాలి. అలా చేయడమే సెలెక్టర్లుగా మా పని.'అని అగార్కర్ చెప్పుకొచ్చాడు.వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి ఇంకా చాలా సమయం ఉందని, ఇప్పుడే ఆ టోర్నీ గురించి మాట్లాడటం సరికాదన్నాడు. కోహ్లీ, రోహిత్‌లు భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారని, ట్రోఫీలు గెలిచారని గుర్తు చేశాడు. ఆస్ట్రేలియాతో ఒక్క సిరీస్‌లో విఫలమైనంత మాత్రాన వారిని పక్కనపెట్టలేమని, భారీ పరుగులు చేసినా ప్రపంచకప్ గురించి ఆలోచించేది లేదని అగార్కర్ స్పష్టం చేశాడు. మహమ్మద్ షమీకి ఏదైనా సమస్య ఉంటే తనతో నేరుగా మాట్లాడవచ్చని, జట్టు ఎంపికపై అతను చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని చెప్పాడు. షమీ ఫిట్‌గా లేకపోవడంతోనే ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయలేదని స్పష్టం చేశాడు. రంజీ క్రికెట్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకుంటే జాతీయ జట్టులోకి తీసుకుంటామని తెలిపాడు.

## కగిసో రబాడను విడుదల చేయనున్న గుజరాత్

గుజరాత్ టైటాన్స్ జట్టులో శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్, మహ్మద్ సిరాజ్, ప్రసిత్ కృష్ణ వంటి స్టార్ ఆటగాళ్లు ఉండగా, కొద్దిమంది ఆటగాళ్లను మాత్రమే మినీ వేలానికి విడుదల చేస్తారు. 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు పాయింట్ల పట్టికలో బెంగుళూర్, పంజాబ్, ముంబై తర్వాత నాల్గవ స్థానంలో నిలిచింది. ఆ జట్టు 2022లో ఛాంపియన్‌షిప్ గెలుచుకుని 2023లో ఫైనల్‌కు చేరుకుంది. ఈ రెండింటినీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో గుజరాత్ ఆడింది. 2024లో శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. 2024లో గుజరాత్ ప్లేఆఫ్‌కు చేరుకోలేదు. 2025 సీజన్‌లో వారు ప్లేఆఫ్‌కు చేరుకున్నారు. అద్భుతమైన టాప్-ఆర్డర్, మిడిల్-ఆర్డర్ బ్యాటింగ్ ఉన్నప్పటికీ, వారు ఫాస్ట్ బౌలింగ్‌తో నిరాశ చెందారు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ వంటి అద్భుతమైన భారతీయ ఫాస్ట్ బౌలర్లు ఉన్నప్పటికీ, విదేశీ బౌలర్ల అవసరం ఉంది. రబాడకు బ్యాకప్ ప్లేయర్ కూడా అవసరం. ఆ విషయంలో 2026 మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ ఈ 5 మంది ఆటగాళ్లను విడుదల చేయనుందని సమాచారం. ఆ 5 మంది ఆటగాళ్ల జాబితా ఇక్కడ ఉంది. కగిసో రబాడ గుజరాత్ టైటాన్స్ అతన్ని రూ. 9.25 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో అతను కేవలం 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 2 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల దక్షిణాఫ్రికాకు తిరిగి వచ్చినప్పుడు అతను సంచలనం సృష్టించాడు. ఆ సమయంలో అతను డ్రగ్ కేసులో కూడా చిక్కుకున్నాడు. అతను మంచి బౌలర్ అయినప్పటికీ, అతను కాంబినేషన్‌లో లేడు. కాబట్టి గుజరాత్ అతన్ని విడుదల చేయవచ్చు. కరీం జనత్ గుజరాత్ అతన్ని రూ. 75 లక్షలకు కొనుగోలు చేసింది. అయితే, విదేశీ ఆటగాడి స్థానంలో అతను అవసరం లేనందున గుజరాత్ అతన్ని విడుదల చేయాలని కోరుకుంటుంది. అతని స్థానంలో విదేశీ ఆల్ రౌండర్‌ను కొనుగోలు చేయాలని వారు ప్లాన్ చేస్తారు. జెరాల్డ్ కోయెట్జీ గత సీజన్‌లో కూడా అతను పేలవమైన ప్రదర్శన కనబరిచాడు. 4 మ్యాచ్‌ల్లో కేవలం 2 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అతను తరచుగా గాయపడుతుండటం వలన గుజరాత్ అతన్ని విడుదల చేయాలని యోచిస్తోంది. గుజరాత్ అతన్ని రూ. 2.40 కోట్లకు కొనుగోలు చేయడం గమనార్హం. ఇషాంత్ శర్మ వయసు మీద పడుతుంది. కానీ అతను ఇంకా బాగా బౌలింగ్ చేస్తున్నాడు. మరోవైపు, అతని ఫిట్‌నెస్ పెద్ద సమస్య అవుతుంది. అతన్ని గుజరాత్ టైటాన్స్ రూ.75 లక్షలకు కొనుగోలు చేసింది. గుజరాత్ జట్టులో ఫినిషర్లకు కొరత లేదు. అతను 5, 6 స్థానాల్లో కూడా వస్తాడు. గుజరాత్ అతన్ని రూ. 1.70 కోట్లకు కొనుగోలు చేసింది. అతన్ని జట్టులో ఉంచే బదులు, తక్కువ ధరకు బ్యాకప్ ఆటగాడిని కొనుగోలు చేయవచ్చు. గత సీజన్‌లో అతనికి అవకాశం రాలేదు.



## కోహ్లీ చరిత్ర సృష్టిస్తారా?

భారతదేశ దిగ్గజ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్ళలో ఒకరు. విరాట్ దాదాపు 7 నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వస్తున్నారు. కోహ్లీ అక్టోబర్ 19 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియాతో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆడనున్నారు. విరాట్ టెస్ట్, టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అతను వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడతారు. కోహ్లీని మళ్లీ ఇండియన్ జెర్సీలో చూడటానికి అభిమానులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. అదే సమయంలో, ఆస్ట్రేలియాలో విరాట్ 4 పెద్ద రికార్డులు ఎదురు చూస్తున్నాయి. వాటిని అతను తన పేరు మీద రాసుకోనున్నారు. కుమార్ సంగాకర (14,234)ని వన్డేల్లో పరుగుల పరంగా అధిగమించి, విరాట్ కోహ్లీ వన్డే చరిత్రలో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ కావచ్చు. సంగాకర వన్డేల్లో 14,234 పరుగులు చేశాడు. అదే సమయంలో, విరాట్ ఇప్పటివరకు 14,181 పరుగులు చేశాడు. కోహ్లీ, సంగాకర కంటే కేవలం 54 పరుగులు దూరంలో ఉన్నాడు, ఇది విరాట్ ఒక పెద్ద ఇన్నింగ్స్‌లో సాధించగలిగే ఒక మైలురాయి.విరాట్ కోహ్లీ వన్డే మ్యాచ్‌లలో 1,484 ఫోర్లు కొట్టాడు. 1,500 ఫోర్లు పూర్తి చేయడానికి కేవలం 16 ఫోర్లు మాత్రమే అవసరం. ఆస్ట్రేలియాలో విరాట్ 16 ఫోర్లు కొట్టడం ద్వారా ఒక ప్రత్యేకమైన విజయాన్ని తన పేరు మీద చేసుకోవచ్చు, ఇది అతని అద్భుతమైన వన్డే కెరీర్‌ను చూపుతుంది.విరాట్ కోహ్లీ ప్రస్తుతం సచిన్ టెండూల్కర్ సరసన ఉన్నాడు, ఎందుకంటే ఇద్దరు దిగ్గజ బ్యాట్స్‌మెన్‌లు ఒక్కో ఫార్మాట్‌లో 51 సెంచరీలు సాధించారు. టెండూల్కర్ టెస్ట్ క్రికెట్‌లో 51 సెంచరీలు సాధించగా, కోహ్లీ వన్డేల్లో ఈ ఘనత సాధించాడు. మరో సెంచరీ సాధించడంతో, విరాట్ కోహ్లీ ఒక ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన రికార్డును బద్దలు కొట్టి సచిన్ టెండూల్కర్‌ను అధిగమిస్తాడు.విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాలో 1000 వన్డే పరుగులు చేసిన మొదటి బ్యాట్స్‌మన్ కావచ్చు. విరాట్ ఆస్ట్రేలియాలో ఇప్పటివరకు 18 మ్యాచ్‌లు ఆడాడు, ఇందులో అతను 47.17 అద్భుతమైన సగటుతో 802 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాలో 1000 వన్డే పరుగులు పూర్తి చేయడానికి విరాట్‌కు 198 పరుగులు అవసరం. విరాట్ ఈ 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పరుగులు పూర్తి చేస్తారని అందరూ ఆశిస్తున్నారు.

## రోహిత్ శర్మను చూసి నేర్చుకున్నా..





ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపై తనకున్న అభిమానాన్ని ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ చాటుకున్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో రోహిత్ శర్మను చూసి తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపాడు. రోహిత్ శర్మతో కలిసి ఆడే అవకాశం ఇప్పటి వరకు రాలేదని, ఏదో ఒక రోజు అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశాడు.మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం పెర్త్ వేదికగా జరిగే తొలి మ్యాచ్ నేపథ్యంలో ట్రావిస్ హెడ్ శుక్రవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా కోహ్లీ, రోహిత్ శర్మల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ కంటే రోహిత్ ఏ విషయంలోనూ తక్కువ కాదని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలోనే ఈ ఇద్దరూ వీడ్కోలు పలికే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. వన్డే ప్రపంచకప్ 2027 వరకు ఆడుతారని ఆశిస్తున్నానని తెలిపాడు.'రోహిత్, కోహ్లీ భారత జట్టుకు ఎంతో చేశారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఈ ఇద్దరూ అసాధారణమైన ఆటగాళ్లు. బహుషా కోహ్లీ గొప్ప వైట్ బాల్ క్రికెటర్ కావచ్చు. కానీ రోహిత్ అతని కంటే ఏ మాత్రం తక్కువ కాదు. అతను తనదైన శైలిలో ఓపెనింగ్ చేసే బ్యాటర్. అతను సాధించిన ఘనతలపై నాకు చాలా గౌరవం ఉంది. ఏదో ఒక దశలో ఈ ఇద్దరి ఆటగాళ్లను మిస్సవుతాం. అయితే 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆడుతారని అనుకుంటున్నాను. కనీసం ఆ టోర్నీ ఆడేందుకైనా వారు ప్రయత్నిస్తారు. రోహిత్ శర్మతో కలిసి ఆడే అవకాశం వస్తే గొప్పగా భావిస్తా. ఇప్పటి వరకైతే అతనితో కలిసి ఆడే అవకాశం దక్కలేదు. మనలానే ఆడే ఆటగాడిని దూరం నుంచి చూడటం బాగుంటుంది. అంతర్జాతీయ క్రికెట్, ఐపీఎల్‌లో రోహిత్‌కు ప్రత్యర్థిగా చాలా మ్యాచ్‌లు ఆడాను. అతను సరైన పద్దతిలో ఆడుతాడు. అయితే అతనితో కలిసి ఆడే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు. భవిష్యత్తులో ఆ అవకాశం రావచ్చు. అతను మరింత సుదీర్ఘం కాలం ఆడుతాడు. అప్పుడు నాకు అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకునే ఛాన్స్ దక్కవచ్చు. అతను ఓపెనింగ్ చేసినా ఒకేలా ఆడుతాడు. బెస్ట్ బ్యాటర్ నుంచి ఎందుకు నేర్చుకోకూడదు.'అని ట్రావిస్ హెడ్ అన్నాడు.



## వన్డే సిరీస్ నుంచి కామెరాన్ గ్రీన్ ఔట్

భారత్ తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందే ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. భారత్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి 2 రోజుల ముందు ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా సిరీస్ నుండి వైదొలిగాడు. అతడి స్థానంలో వన్డే సిరీస్ కోసం మార్నస్ లాబుషేన్‌ను ఆస్ట్రేలియా జట్టులోకి తీసుకున్నారు.కండరాల గాయం వల్ల కామెరూన్ గ్రీన్ భారత్‌తో జరిగే వన్డే సిరీస్ నుంచి వైదొలిగాడు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా సెలెక్టర్లు ఎలాంటి రిస్క్ తీసుకోకూడదు అనుకుంటున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటనలో "కామెరాన్ గ్రీన్ కొంతకాలం పాటు రెస్ట్ తీసుకుంటాడు. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌కు సిద్ధం కావడానికి షెఫీల్డ్ షీల్డ్ మూడో రౌండ్‌లో ఆడటానికి అవకాశం ఉంటుందని" ఆసీస్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది.కామెరూన్ గ్రీన్ స్థానంలో మార్నస్ లాబుషేన్‌ను ఆస్ట్రేలియా వన్డే జట్టులోకి తీసుకున్నారు. గురువారం క్వీన్స్‌లాండ్ తరపున షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో 159 పరుగులు చేశాడు. దేశవాళీ సీజన్‌లో లాబుషేన్ కు ఇది నాల్గవ సెంచరీ. 31 ఏళ్ల లాబుషేన్ 66 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లలో ఆసీస్‌కు ఆడాడు. ఇందులో 34.64 సగటుతో, 83.56 స్ట్రైక్ రేట్‌తో 1871 పరుగులు సాధించాడు. లబుషేన్ భారత్‌తో 15 వన్డే మ్యాచ్‌లు ఆడాడు, అందులో 13 ఇన్నింగ్స్‌లలో 474 పరుగులు చేశాడు. ఇందులో 4 అర్ధ శతకాలు ఉన్నాయి. లాబుషేన్ 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై 58 పరుగులు చేశాడు. భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్ జట్టు భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, యశస్వి జైస్వాల్. ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కోనోలీ, అలెక్స్ కేరీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, మార్నస్ లాబుషేన్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ ఓవెన్, మాట్ రెన్‌షా, ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, మాథ్యూ కునెమాన్, జోష్ ఫిలిప్. భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్ షెడ్యూల్ మొదటి వన్డే – అక్టోబర్ 19వ తేదీన (పెర్త్) రెండవ వన్డే – అక్టోబర్ 23వ తేదీన (అడిలైడ్) మూడవ వన్డే – అక్టోబర్ 25వ తేదీన (సిడ్నీ) భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లోని 3 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఉదయం 8:30 గంటలకు కెప్టెన్లు టాస్‌కు వస్తారు.

## పాకిస్తాన్‌కు రూ.100 కోట్ల నష్టం

ఆసియా కప్ 2025 ఫైనల్లో భారత్ పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్‌లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్‌ను ఓడించి అజేయంగా నిలిచింది. ఆసియా కప్ గెలిచినప్పటికీ, భారత జట్టు ఇంకా ట్రోఫీని గెలుచుకోలేదు. ఇంతలో, భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ టోర్నమెంట్ నుంచి గణనీయంగా లాభపడింది. రూ.100 కోట్లు (సుమారు %వి%1.2 బిలియన్లు) సంపాదించింది. ఇంతమంది ప్రేక్షకులు వస్తారని ఊహించని పాకిస్తాన్‌కు ఇది గణనీయమైన దెబ్బ తగిలింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన ఆసియా కప్ బీసీసీఐ గణనీయమైన ఆదాయాన్ని ఆర్జించింది. %యూ×% నివేదికల ప్రకారం, అంతర్జాతీయ పర్యటన భారత బోర్డుకు సుమారు రూ.109.04 కోట్లు (సుమారు %వి%1.09 బిలియన్) లాభాన్ని ఆర్జించింది. ఈ ఆదాయం ఐసీసీ టీ20ఐ ప్రపంచ కప్‌ను నిర్వహించే ఫీజులు, టీవీ హక్కులు, పాల్గొనడం ద్వారా వస్తుంది. బోర్డు మీడియా హక్కుల ద్వారా రూ. 138.64 కోట్లు (సుమారు %వి%1.38 బిలియన్) అందుకుంది. ఆసియా కప్‌లో భారతదేశం పాకిస్తాన్‌తో మూడు మ్యాచ్‌లు ఆడింది. దీంతో గణనీయమైన ఆదాయానికి ఇది ప్రధాన కారణం. నివేదికల ప్రకారం, 2025-26 సంవత్సరానికి బీసీసీఐ వార్షిక బడ్జెట్ ఈ సంవత్సరం బోర్డు సుమారు రూ. 6,700 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలదని సూచిస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ వరుసగా రెండవ సంవత్సరం తగ్గినప్పటికీ, బీసీసీఐ ఆర్థిక స్థితి బలంగా ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతున్నప్పటికీ, ఐపీఎల్ వల్ల అది గణనీయమైన నష్టాలను చవిచూస్తోంది. నివేదికల ప్రకారం, 2025లో ఐపీఎల్ విలువ రూ. 76,100 కోట్లుగా అంచనా వేసింది. ఇది గత సంవత్సరం రూ. 82,700 కోట్ల నుంచి గణనీయంగా తగ్గింది.

# ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి



'కోరుకున్న రంగంలో రాణించాలంటే మనలో ఒక తపన ఉండాలి. ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి' అంటారు. ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే. లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్పైఏళ్లుగా ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, గుర్తింపు పొందారు. ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత స్థాయికి ఎదిగారు. విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. 'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు. సృజనతో అడుగు... పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయిం టింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది. ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.. "నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే అధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది.

మావారు సివిల్ ఇంజనీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్‌ప్రారంభించాను. భవనాలు కట్టే లోకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్నప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు. 200 భవనాల జాబితా.. భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించిప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపదపైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురిత మయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది.

'షామ్ ఎ అవద్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను. లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్!
2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండిషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు,ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పనిప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను. ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.



## తప్పు చేయకండి.. ఎండలో అవి అవసరాలు కాదు.. అనర్థాలు!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు,అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.
ఇంట్లో అక్కర్లేదు.. సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.
కడుగుతూనే ఉండాలి... ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటి మాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది. అదైతే చాలు..
వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే. అన్నీ తాగొచ్చు.. ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్లలాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.

# విజయాలకు తను ఒక 'ల్యాండ్ మార్క్'..



సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని 'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు. భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని 'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది. తాజాగా.. ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్ 2024 జాబితాలో చోటు సాధించింది.రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది. హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్‌లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది. 'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్లు సందేహాల దగ్గరే తచ్చాడుతారు. 'కచిత్చంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు. రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్-ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్. 2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది. రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ?డక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచిప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్‌మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది. భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్‌మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది.

'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్‌ప్రాసెస్‌లో ర్యాపిడ్ చేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక. రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్స్ ?న్ ఏమిటి?' అని అడిగాడు. దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు.. 'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది' భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడాప్రాధాన్యత ఇస్తోంది. భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

# 'నిద్రాయోగం'! శారీరక ఆరోగ్యంపై నిద్ర ముద్ర ఇది..



అనేక యోగ ముద్రలు ఉన్నట్లే, 'యోగ నిద్ర' కూడా ఉంది. నిద్ర కూడా ఒక యోగమే." నిద్ర పట్టడం ఒక యోగం, బాగా నిద్రపోవడం ఒక భోగం, నిద్ర పట్టకపోవడం ఒక రోగం" అని చెప్పవచ్చు. ముఖ్యంగా మారిన పని సంస్కృతి (వర్క్ కల్చర్), వివిధ ఒత్తిళ్ల నేపథ్యంలో నిద్ర కొంతమందికి వరంగా, ఎక్కువమందికి శాపంగా మారి కొత్త కొత్త ఆరోగ్య సమస్యలు పుట్టుకొస్తున్నాయని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొందరికి నిద్ర ఎక్కువ కావడం, కొందరికి తగ్గిపోవడం ఈ మధ్యకాలంలో వచ్చిన ముఖ్య పరిణామంగా పరిశీలకులు భావిస్తున్నారు. మన జీవన గమనంపై, మానసిక, శారీరక ఆరోగ్యంపై నిద్ర వేసే ముద్ర చాలా గొప్పది. "కంటికి నిద్ర వచ్చునే? సుఖంబగునే రతికేళి?" అంటాడు శ్రీనాథ కవి సార్వభౌముడు ఒక సందర్భంలో. "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" అన్నాడు ఆధునిక కవి కొసరాజు రాఘవయ్య చౌదరి. ఇలా నిద్ర చుట్టూ అనేక మాటలు, చర్చలు, సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. 'నిద్ర' శరీరానికి సంబంధించిన ఒక విశ్రాంత స్థితిగా చెప్పినప్పటికీ, అది మనసుకు, మెదడుకు కూడా వర్తిస్తుందని చెప్పాలి. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మెదడుకు కూడా అంతే అవసరం. అవయవాల అలసట తీర్చి, తిరిగి రెట్టింపు శక్తితో దైనందిన కార్యక్రమాలను చేపట్టడంలో నిద్ర పోషించే పాత్ర చాలా కీలకమైంది. మానవ జీవితంలో నిద్ర ప్రాథమిక అవసరమని, అది పౌరుల ప్రాథమిక హక్కు, అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. నిద్ర, నిశ్శబ్దం, విశ్రాంతి ఆరోగ్య రీత్యా మానవులకు తప్పనిసరి అవసరమని, నిశ్శబ్దం బంగారం లాంటిదని న్యాయస్థానాలు సైతం వ్యాఖ్యానించాయి. నిద్రపై అనేక పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం జరిపిన పరిశోధనల పరంగా చూస్తే, రోజుకు 8 గంటల కంటే తక్కువ నిద్ర పోయే వారిలో శారీరక సామర్థ్యం తక్కువగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ప్రతి సంవత్సరం మార్చి నెల మూడో శుక్రవారం నాడు 'ప్రపంచ నిద్ర దినోత్సవం' కూడా జరుపుకుంటున్నారు. సాధారణంగా పెద్దవాళ్ల కంటే చిన్నపిల్లలకు ఎక్కువ నిద్ర ఎంతో అవసరం. ఇది వారి శారీరక పెరుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. నెలబాలుడు నుంచి వృద్ధుడి వరకూ నిద్ర పోవాల్సిన సగటు సమయంపై అనేక పట్టికలు విడుదలయ్యాయి. కానీ, పాటిస్తున్న వారిసంఖ్య పరిమితం మాత్రమే. ముఖ్యంగా, ఆధునిక జీవనశైలి నిద్రపై పెను ప్రభావాలను చూపిస్తోంది. నిద్రకు సంబంధమైన అంశాల్లో ఆహారం పాత్ర ఎంతో కీలకం. మెలటోనిన్ స్థాయిల్ని పెంచే ఆహారం వల్ల గాఢ నిద్ర పడుతుందని ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తాజాగా విడుదల చేసిన నివేదికలో వివరిస్తున్నారు. మన ఆలోచనా విధానంతో పాటు మనం తీసుకొనే ఆహార, పానీయాల బట్టి కూడా నిద్ర ఆధారపడుతుందని కొందరు శాస్త్రవేత్తలు నమ్ముతుంటారు. ఈ అంశం ఇంకా శాస్త్రీయంగా రుజువు కావాల్సిన అవసరం ఉంది. మెలటోనిన్ అనేది ఒక హార్మోన్. మనం తీసుకొనే ఆహారం.. నిద్రకు అత్యంత అవసరమైన మెలటోనిన్‌ను అనుకూలంగా, లేదంటే ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. దానికి అనుగుణంగా నిద్ర తీరు మారిపోతుంది. అమైనో ఆమ్లం(ట్రిప్టోఫాన్) ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మెలటోనిన్ హార్మోన్ స్థాయిలు బాగా పెరుగుతాయి. తద్వారా నిద్ర బాగా పడుతుంది. విటమిన్-డి, మెగ్నీషియం, జింక్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు మంచి నిద్రకు ప్రేరకాలుగా నిలుస్తాయి. చేపలు, కివీ పండు, టార్ట్ చెర్రీలు నిద్ర పట్టడానికి ఎంతో ఉపయోగపడతాయి. పడుకునే ముందు గ్లాసు వేడి పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. ఇలా నిద్రకు - ఆహార, పానీయాలకు ఉండే సంబంధాలను నిపుణులు వివరిస్తున్నారు. నిద్రను - మత్తును వేరు వేరుగా చూడమంటున్నారు. (గుండెలు పిండే విషాదం : మరణానికి ఏర్పాట్లు చేసుకుంటున్న స్టార్ యాక్టర్) మద్యపానం వల్ల మెదడు చైతన్య రహితంగా మారి మత్తుగా అనిపిస్తుంది.అది మత్తే కానీ, నిద్ర కాదని వైద్యులు అంటున్నారు. నిద్ర విషయంలో నిర్దిష్ట సమయాలను పాటించడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. నేటి కాలంలో, పెరిగిన వృత్తుల వైవిధ్యం, వేళల నేపథ్యంలో సమయపాలన పాటించడం అందరికీ సాధ్యపడదు. వారి వారి వీలునుబట్టి నిద్ర వేళల విషయంలో క్రమశిక్షణను అనుసరించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నుంచి వచ్చే వెలుగులు కూడా హానికరం అని అంటున్నారు. నిద్రకు ఉపక్రమించే ముందు, పడక గదులలో వీటికి దూరంగా ఉండమని నిపుణులు చేసే సూచనలను గౌరవిస్తే మంచిది. వ్యాయామం, నడక, శారీరక శ్రమ, యోగాభ్యాసం, ధ్యానం, ప్రాణాయామం నిత్యం సాధన చేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, మెదడుకు మేత వేసే పనులు చేయడం కూడా నిద్రపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయని తరచూ మనం వింటున్నాం. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ కరోనా కాలంలో బాగా ప్రచారంలో ఉంది. నిద్ర అందుకు ఎంతో ఉపయోగపడుతుంది. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలన్నా, మంచి నిద్ర అవసరం. నిద్ర తగ్గితే కాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'నిద్ర ఒక చిత్తవృత్తి'గా పతంజలి యోగ సూత్రాలు చెబుతున్నాయి. ఆహారంతో పాటు మనసును అదుపులో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన నిద్రకు శరీరం అలవాటు పడుతుందని యోగాచార్యులు సూచిస్తున్నారు. నిద్ర ఎంతసేపు పొయ్యామన్నదాని కంటే? ఎంత బాగా నిద్ర పోయామన్నదే ముఖ్యం. 'నిద్రించడం' ఒక కళగా భావిస్తే అన్నీ సర్దుకుంటాయి. యోగం, భోగం, ఆరోగ్యం అన్నీ కలిసి వస్తాయి.

## ఇలా మాత్రం 'చెవి'ని శుభ్రం చేయకండి..

పెరుగుతున్న కాలుష్యానికి ఆరోగ్య సమస?్యలు కూడా అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే రోగాల బారిన పడుతున్నాం. ఈ కాలుష్యానకి చెవి, ముక?్కు, కంటి సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయి. చెవి విషయానికొస్తే, చిన్న పిల?్లల్లోనే కాకుండా పెద్దవారిలోనూ వినికిడి లోపం పెరుగుతంది. వాటికి కారణాలు కూడా చాలా ఉన్నాయి. మరి చెవిని కాపాడడంలో.. చేయాల్సిన జాగ్రత్తలను చూద్దాం.
చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..
పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి. చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు.. భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి. పై జాగ్రత్తలు పాటించాక కూడా.. గులివి, చీము వంటి సమమస్యలతో పాటు.. చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా.. వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.



# ఆత్మనూన్యత భావాన్ని విడనాడండి..

### ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలి..

### ప్రతిబంధకాలను అధిగమించినప్పుడే అశించిన స్థాయికి ఎదుగుతాం..

### ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉన్నత శిఖరానికి చేరండి..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



విజయవాడ,అక్టోబర్17 : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని విడనాడి, జీవిత లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, ప్రతిబంధకాలను అధిగమించి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉత్తమ విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణ పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గుణదల గంగిరెద్దుల దిబ్బలో గల సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థినీ, విద్యార్థులతో కలసి అల్పాహారం చేశారు. తొలిత జిల్లా కలెక్టర్ గంగిరెద్దుల దిబ్బలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖి చేశారు. 128 మంది ఇంటర్, పీజి విద్యార్థులకు గాను 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. మెను ప్రకారం పెసరపప్పుపొంగలి, పుట్నాల చెట్నీ, కోడిగుడ్డు, మిల్లెట్ చిక్కీ, విద్యార్థులకు అందించే తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలలో వసతి పొంది విద్యనభ్యశించే విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని విడనాడాలన్నారు. పేద విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యశించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి అధునాతన మౌలిక వసతులు. పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. చిన్నతనంలో తాను కూడా హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యశించి ఈ స్థాయికి ఎదిగిన వాడినేనన్నారు.. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఎదురయ్యే ప్రతిబంధకాలను అధిగమించాలని అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించగలుగుతామన్నారు. ఎంతో మంది మహానుభావాలు వసతి గృహాలలో ఉండి చదువుకుని అత్యంత ప్రతిభావంతులయ్యారని వారిని ఆదర్శంగా తీసుకుని కష్టాన్ని ఇష్టంగా చేసుకుని శ్రమించాలని సూచించారు. విద్యార్థులకు స్టార్టప్, స్కిల్ డవలప్‌మెంట్ గురించి వివరించి వినూత్నంగా ఆలోచించేలా చర్యలు తీసుకోవాలని, ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌ను విద్యార్థులకు సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థుల భవిష్యత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యంతులను చేసి పట్టుదలతో మంచి విద్యను అభ్యశించేందుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి వారానికి ఒక రోజు హాస్టల్స్‌ను సందర్శించి నిర్వహణలో లోపాలను గుర్తిస్తే సరిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కాచి చలార్చిన నీటీని వినియోగించాలన్నారు. హాస్టల్స్‌కు సరఫరా చేసే మినరల్ వాటర్ ప్లాంట్లను వాటర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యశించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాంలో లివింగ్ రూమ్, డైనింగ్ కిచెన్ షెడ్ నిర్వహణకు సరిపోవడం లేదని, సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్ కంపౌండ్ వాల్ పై ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు చేపట్టేలా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సంక్షేమ వసతి గృహ తనిఖీలలో వెనకబడిన తరగతుల వసతి గృహా సంక్షేమ అధికారిణి ఎ. విజయదుర్గ, సిబ్బంది ఎం. రాజశేఖర్, రెహమాన్, పి. రాజశేఖర్, సాంఘిక సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎ.వనజా రమణి, సిబ్బంది ఎం.సమాదానం, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## గుజరాత్‌లో కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

### 26మంది కొత్త మంత్రుల ప్రమాణం

### క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాకు చోటు

గాంధీనగర్,అక్టోబర్17 : గుజరాత్‌లో కేబినేట్‌ను పునర్వ్యవస్థీకరించారు. ముఖ్యమంత్రి మినహా మిగతా మంత్రులంతా రాజీనామా చేయడంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటు అయింది. గాంధీ నగర్‌లో శుక్రవారం 26 మంది సభ్యుల కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. గవర్నర్ వీరితో ప్రమాణం చేయించారు. వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా కూడా ఉన్నారు. గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా గుజరాత్ మంత్రులందరూ తమ రాజీనామాలను సమర్పించారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో రాష్ట్ర క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా ఈ రాజీనామా పక్రియ చోటుచేసుకున్నట్లు పార్టీ నేతలు మీడియాకు వెల్లడించారు. గుజరాత్ అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 182. నిబంధన ప్రకారం.. మంత్రుల సంఖ్య 27 వరకు ఉండొచ్చు. 1990లో రాజ్‌కోట్‌లో జన్మించిన రివాబా ఆత్మియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2016 ఏప్రిల్ 17న భారత క్రికెటర్ రవీంద్ర జడేజాను వివాహం చేసుకున్నారు. 2019లో భాజపాలో చేరారు. 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఆమె కమలదళంలో చేరడానికి ముందు 2018లో కర్ణిసేన మహిళా విభాగానికి చీఫ్‌గా వ్యవహరించారు.

## ప్రధాని కర్నూలు పర్యటన విజయవంతం

### అధికారులను అభినందించిన సిఎం చంద్రబాబు

అమరావతి,అక్టోబర్17 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులు, వివిధ శాఖల అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ప్రధాని నాలుగోసారి పర్యటించారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఉద్ఘాటించారు. ఈ సభ మంచి మెసేజ్ ఇచ్చిందని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ పర్యటనలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. ప్రధాని మోదీ సైతం పర్యటనను ఎంతో ఆస్వాదించారని పేర్కొన్నారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనంపై ప్రధాని ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. ప్రధాని మోదీ సైతం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను అభినందించారని తెలిపారు. జీఎస్టీపై నెల రోజులపాటు చేసిన కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## సోషల్ సర్వేలో పాల్గొనకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నా

### నారాయణమూర్తి దంపతుల తీరుపై ఘాటుగా స్పందించిన సిఎం

బెంగళూరు,అక్టోబరు17 : కర్ణాటకలో జరుగుతున్న సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి , సుధామూర్తి నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి సిద్దారామయ్య శుక్రవారం నాడు ఘాటుగా స్పందించారు. తాము చేపట్టినది వెనుకబడిన తరగతుల సర్వే కాదని, జనగణన అని చెప్పారు. 'అది వాళ్లకే వదిలిపెట్టాను. ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు. వాళ్లకి అర్థం కాకపోతే నేను ఏం చేయగలను? ఇన్ఫోసిస్‌లో ఉన్నంత మాత్రానా వాళ్లు సర్వజ్ఞులా. ఇదెంత మాత్రం వెనుకబడి తరగతుల సర్వే కాదని 20 సార్లు చెప్పాం. ఇది మొత్తం జనాభాను లెక్కించే సర్వే' అని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక వెనుకబడి తరగతుల కమిషన్ చేపట్టిన 'సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వే'లో పాల్గొనరాదని నారాయణ మూర్తి దంపతులు నిర్ణయం తీసుకున్నారు. ఎన్యూమరేషన్ కోసం ఆ దంపతుల ఇంటికి వెళ్లినప్పుడు తమకు సర్వే అక్కర్లేదని చెప్పినట్టు అధికారులు తెలిపారు. తాము వెనుకబడిన తరగతులకు చెందిన వారముకాదని, ఆ సామాజిక వర్గం కోసం నిర్వహిస్తున్న సర్వే కావడంతో తాను ఇందులో పాలుపంచుకోవడం లేదని నారాయణ మూర్తి దంపతులు తెలిపారు. తమ విషయంలో సర్వేకు ఎలాంటి ఔచిత్యం లేదని ప్రకటిస్తూ సర్వే ఫారంపై సుధామూర్తి సంతకం చేసినట్టు తెలుస్తోంది. ఈ పక్రియకు దూరంగా ఉంటున్నట్టు పేర్కొంటూ మూర్తి దంపతులు డిక్లరేషన్ కూడా ఇచ్చారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి దంపతులు సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని తీసుకున్న నిర్ణయంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, సర్వేలో పాల్గొనమని తాము ఎవరినీ బలవవంత పెట్టడం లేదని, ఐచ్ఛికంగా సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. కాగా, ఇన్ఫోసిస్ మాజీ సీఈవో మోహన్‌దాస్ పాయ్ సైతం కులసమీకరణపై విమర్శలు గుప్పించారు. 'ఉద్యోగులకు లభిస్తున్న పెద్ద పేమెంట్లు, ప్రయోజనాలతో పోల్చుకుంటే ఇది చాలా చిన్నది. కర్ణాటకలో మంత్రలకు మంచి ఉద్యోగాలు, టక్నాలజీ, అభివృద్ధి కంటే కులం, కుల సర్వేలు, బుజ్జగింపులపైనే ఎక్కువ ఆసక్తి ఉంది' అని అన్నారు. కర్ణాటక హైకోర్టు కూడా ఇటీవల తమ ఉత్తర్వుల్లో సోషియో-ఎకానమిక్, ఎడ్యుకేషన్ సర్వే తప్పనిసరి కాదని బహిరంగంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాలపై సర్వేయర్లు పట్టుబట్ట రాదని, సేకరించిన సమాచారం మొత్తం బీసీ కమిషన్‌కు మినహా పూర్తి కాన్ఫిడెన్సియల్‌గా ఉంచాలని ఆదేశాలిచ్చింది. వెనుకబడిన తరగతుల వారికి ప్రయోజనాలు చేకూర్చేందుకు ఉద్దేశించిన సర్వేలోని సమాచారం పౌరుల హక్కులను ఉల్లంఘించేలా ఉండరాదని పేర్కొంది.

## భూదాన్ భూములపై హైకోర్టు కీలక నిర్ణయం

### ఐఎఎస్‌లకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్,అక్టోబరు17 ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం భూదాన్ భూముల వ్యవహారం పై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ ను కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. సర్వే నెంబర్ 194, 195 భూదాన్ భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసి అన్యాక్రాంతం చేశారంటూ పిటిషనర్ తరపున లాయర్ హైకోర్టు వాదించారు. అయితే పిటిషనర్ వాదనలను ధర్మాసనం ఏకిభవించలేదు. ఈ కేసులో ఇంప్లిడ్ పిటిషన్లు , ఇంటర్‌లోక్యుటరీ అప్లికేషన్ పిటిషన్లు కూడా హైకోర్టు కొట్టి వేసింది. మరోవైపు భూదాన్ భూముల వ్యవహారంలో ప్రధాన కేసు విచారణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారంలోని 181, 182 సర్వే నెంబర్‌లో సుమారు 103 ఎకరాలు భూదాన్ భూమి ఉంది. ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. అందులో సుమారు 50 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ 50 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో.. వారు అందులో ఎ÷-లాట్లుగా విభజించి.. విక్రయాలు చేపట్టారు. అయితే ఈ అంశం ప్రస్తుతం హైకోర్టు(÷ు్గ÷జీనిణజీనిజీ ఊతిణర అనీబీసబి) కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఈ భూములకు సంబంధించి లావాదేవీలపై కోర్టు స్టే విధించింది. ఇక ఈ అంశంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు.. గతంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు గుర్తించారు.

# ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు

### వందరోజుల ప్రణాళిక అమలుపై సమీక్ష

### జాలర్లకు మేలు చేసే నిర్ణయాలపై పవన్ ఆరా



అమరావతి,అక్టోబరు17 : ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.. మత్స్య సంపద పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలపై శుక్రవారం) పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో వంద రోజుల ప్రణాళిక అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), విశాఖపట్నం శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ చర్చించారు. మత్స్యకారుల్లో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించడానికి గల అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు తమ సమస్యలని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి వందరోజుల ప్రణాళిక చేపట్టారు. ఈ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలని అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం, తదితర అంశాలపై విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. యన సూచనలను అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కి పవన్ కల్యాణ్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల పరకామణి చోరీ కేసు

### అధికారుల తీరుపై మైకోర్టు ఆగ్రహం

అమరావతి,అక్టోబర్17 : తిరుమల పరకామణి చోరీ కేసుపై టిటిడి తీరుపై ఏపీ హైకోర్టు మరోమారు అసహనం వ్యక్తం చేసింది. శుక్రవారం దీనిపై హైకోర్టులో విచారణ జరిగింది. సీజ్ చేసిన ఫైళ్లు, ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఉన్నత న్యాయస్థానానికి సీఐడీ సమర్పించింది. ఈ ఘటనపై కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తితిదే ఈవోపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తితిదే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నెల 27న ఈవో న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో రూ.20 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఘటనపై కౌంటర్ దాఖలు చేసేందుకు తితిదే సమయం కోరింది. ఇందుకు సమయమిస్తూ విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 27కు వాయిదా వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై 2023లోనే తితిదే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి తితిదే అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోకాయుక్తతో రాజీ చేయించారు. శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ వేయడంతో హైకోర్టు విచారణకు స్వీకరించింది. మరోవైపు దీనికి సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో పరకామణిలో దస్త్రాలను సీఐడీ సీజ్ చేసింది.

## కనకదుర్గమ్మకు కీర్తిలాల్ జ్యువెలర్స్ విరాళం

విజయవాడ,అక్టోబర్17 : ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు రూ.2కోట్ల విలువైన వజ్రాలతో కూడిన బంగారపు ఆభరణాలను కానుకగా అందించారు. కీర్తిలాల్ జ్యూయలరీ నిర్వాహకులు సూర్య చంద్రుల ఆభరణాలు, ముక్కుపుడక, బులాకీ, బొట్టు, సూత్రాలు, గొలుసు, కంఠాభరణాలను దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో శీనానాయక్‌లకు ఆలయ ప్రాంగణంలో ఇచ్చారు. 531 గ్రాముల బంగారం, వజ్రాలతో వాటిని తయారు చేయించారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మీరవి, మాజీ ఎంపీలు గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు, కీర్తిలాల్ జ్యూయలరీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ దంపతులు పాల్గొన్నారు.

## రివాబాకు మంత్రి పదవి ఆనందదాయకం

### ఎక్స్ వేదికగా స్పందించిన భర్త, క్రికెటర్ జడేజా


గాంధీనగర్,అక్టోబర్17 : గుజరాత్ మంత్రిగా తన సతీమణి రివాబా జడేజా ప్రమాణస్వీకారం చేయడంపై టీమ్ ఇండియా క్రికెటర్ రవీంద్ర జడేజా ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు మంత్రి పదవి దక్కడంపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మీరు సాధించిన విజయాలకు ఎంతో గర్వపడుతున్నా. ఇలాగే అద్భుతమైన కృషి చేస్తారని, అన్ని వర్గాల ప్రజలకు ప్రేరణగా నిలుస్తారని నాకు తెలుసు. గుజరాత్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.. జైహింద్' అని పేర్కొన్నారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో గుజరాత్‌లో క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా గుజరాత్ మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఏర్పాటైన కొత్త క్యాబినెట్‌లో జడేజా సతీమణి రివాబా జడేజాకు చోటు దక్కింది. ఆమెకు ప్రాథమిక, మాధ్యమిక, వయోజన విద్యాశాఖను కేటాయించారు.

## పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం

### వైద్యరంగం అభివృద్ధికి మంచి అవకాశం

### ఎలాంటి నష్టం లేదన్న మంత్రి సత్యకుమార్

విజయవాడ,అక్టోబరు17 : పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం వల్ల నష్టం లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. వైసీపీ అసత్య ప్రచారంతో రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందని వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 33 యేళ్ల తరువాత మళ్లీ ప్రభుత్వానికి ఆ కళాశాలు చెందుతాయని.. మెడికల్ కళాశాలలు పూర్తి అయితే 1500 సీట్లు వస్తాయని.. ఇందులో 725 సీట్లు పూర్తిగా ఉచితమని ప్రకటించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ప్రతి చోటా మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఏదో మాట్లాడుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 108, 104లను ప్రైవేటు వ్యక్తులతో నడిపారని గుర్తుచేసిన మంత్రి.. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పార్టనర్ షిప్‌తో చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అసెంబ్లీ కి రా చర్చిద్దాం అంటే వచ్చే ధైర్యం లేదని విమర్శించారు. రిషికొండలో వందల కోట్లు తో భవనాలు నిర్మించారని.. మరి ఈ మెడికల్ కళాశాలలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు చదువకుండా యువత మేదో సంపత్తిని జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. నర్సీపట్నంలో మెడికల్ కళాశాలను జగన్ నిర్మించలేదని.. ఐదు వందల కోట్లు అయితే జగన్ ఖర్చు పెట్టింది ఇరవై కోట్లు మాత్రమే అని తెలిపారు. మెడికల్ కళాశాలకు ఆయన ఇచ్చే నిర్వచనం ఏమిటో జగన్‌కే అర్థం కాదంటూ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఈ మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రజలను తక్కువ అంచనా చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారని.. అయినా ఇంకా పాత పద్ధతిలోనే జగన్ వెళుతున్నారని విమర్శించారు. సెల్ఫ్ ÷నాన్స్ స్కీం తెచ్చింది జగనే అని.. ఇప్పుడు ఆయనే విమర్శిస్తున్నారని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధులపై గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు. ఏ అంశం మాట్లాడినా ఆ విషయంపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.




## 650 కోట్ల వసూళ్లను దాటేసిన కాంతారా

కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే ఇప్పటికే రూ.650 కోట్లను అలవోకగా దాటి బాహుబలి ది బిగినింగ్ రికార్డును బద్దలుకొట్టిన ఈ చిత్రం తాజాగా గదర్ 2 రికార్డును అధిగమించింది. గదర్ 2 చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.700 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపివేస్తూ.. కాంతార రూ.717 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-20 చిత్రాల్లో కాంతార 16వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటించగా గుల్షన్ దేవయ్య, జయరాజ్ కీలక పాత్రల్లో నటించారు.




## ఆకట్టుకోలేక పోయిన తెలుసు కదా..మూవీ


'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డను 'జాక్' సినిమా రిజల్ట్ నిరాశ పర్చింది. దాంతో కాస్తంత జాగ్రత్త పడుతూ 'తెలుసు కదా' మూవీని చేశాడు. నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, ఈ మూవీని టీజీ విశ్వప్రసాద్, ఆయన కూతురు కృతి నిర్మించారు. వరుణ్ (సిద్ధు జొన్నలగడ్డ) ఓ అనాథ. అతని స్నేహితుడు అభి (వైవా హర్ష). ఇద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే పెరుగుతారు. మొదటి నుండి తనకంటూ ఓ సొంత కుటుంబం ఉండాలని కలలుకంటూ ఉంటాడు సిద్ధు. తన ప్రమేయం లేకుండానే జరిగిన ఓ బ్రేకప్ తర్వాత బుద్ధిగా అంజలి (రాశీఖన్నా)ని పెళ్లి చేసుకుంటాడు వరుణ్. పెళ్ళి అయిన కొన్ని నెలలకే అంజలికి పిల్లలు పుట్టరనే విషయం తెలుస్తుంది. దాంతో సరోగసీ ద్వారా పిల్లలను కనాలని అనుకుంటారు. అందుకోసం రాగ కుమార్ (శ్రీనిధి శెట్టి) అనే డాక్టర్ ముందు కొస్తుంది. వరుణ్, అంజలికి తాను సరోగసీ ద్వారా బిడ్డ కంటానని చెబుతుంది. అందుకు వరుణ్ అంగీకరించాడా? వరుణ్ కూ రాగాకు ముందే పరిచయం ఉందా? ఆ పరిచయాన్ని ఎందుకు వీళ్ళిద్దరూ అంజలి దగ్గర దాచి పెట్టారు? దాని పర్యవసానం ఏమిటీ? అనేది మిగతా కథ. ముక్కోణ ప్రేమకథా చిత్రాలకు కొదవలేదు. ప్రతి యేడాది ఎన్నో అలాంటి సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇది అదే తరహా రోమ్ కామ్ మూవీ అయినా... ఇందులో విషయం కాస్తంత భిన్నమైంది. ముక్కోణ ప్రేమకథ కంటే కూడా పెళ్ళైన తర్వాత ఓ యువకుడి జీవితంలో జరిగిన విచిత్రమైన సంఘటనలను బేస్ చేసుకుని సాగే కథ ఇది. కొత్తగా పెళ్ళైన ఓ జంట మధ్యలోకి సరోగసీ మదర్ గా ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే అంశంతో నీరజ కోన ఈ కథను రాసుకున్నారు. ఫస్ట్ హాఫ్ ఆసక్తికరంగా సాగినా... సెకండ్ హాఫ్ లో వరుణ్ నిజాన్ని బయటపెట్టిన తర్వాత మూవీ స్పీడ్ తగ్గిపోయింది. అక్కడ నుండి క్లయిమాక్స్ వరకూ లవ్ అండ్ హేట్ రిలేషన్ లోనే కథంతా సాగింది. ఈ మూడు పాత్రల్లో ఎవరికి వారు... తాము తీసుకున్న నిర్ణయం కరెక్ట్ అనే భావనలో ఉన్నా... థియేటర్లోని ప్రేక్షకుడు మాత్రం ఎవరి పక్షానా నిలబడే పరిస్థితి ఉండదు. నాలుగు పాత్రల చుట్టూనే సినిమా అంతా సాగడం బోర్ కొట్టిస్తుంది. ద్వితీయార్థంలో డ్రామాను పక్కన పెట్టేసి, డైలాగ్స్ మీద మూవీని నడిపే ప్రయత్నం చేసింది నీరజా కోన. తీవ్రమైన భావోద్వేగాలను పండించాల్సి చోట పై పై సన్నివేశాలతో సినిమా సాగిపోయింది. లైఫ్ లో చిల్ అవ్వాలనుకునే కేర్ ఫ్రీ గర్ల్ గా శ్రీనిధి శెట్టి బాగానే చేసింది. రాశీ ఖన్నా పాత్ర హుందాగానే సాగినా సెకండ్ హాఫ్ లోని ట్విస్ట్లు అండ్ టర్న్ ను ఎక్స్ ప్రెస్ చేయడంలో లోటు కనిపించింది. హీరో స్నేహితుడిగా వైవా హర్ష బాగా చేశాడు. అతని పాత్రే సినిమాలో కొంత రిలీఫ్ ను ఇచ్చింది. మిగిలిన మూడు, నాలుగు పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయేవే... ఏ పాత్రకూ ప్రాధాన్యం లేదు.



## ఎల్లమ్మ సినిమా హీరోగా దేవిశ్రీప్రసాద్

### కోడై కూస్తున్న సోషల్ మీడియా

బలగం వేణు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాకు అరుదైన హీరో దొరికాడు. బలగం వంటి సూపర్ సక్సెస్ తర్వాత వేణు ఎల్లమ్మ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తోండగా ఎడాదిన్నరగా హీరో విషయంలో తర్జన భర్జనలు జరుగుతూ ఉన్నాయి. నాని, నితిన్, శర్వానంద్, నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా నలుగురైదుగురు పేర్లు తెరమీదకు వచ్చి పోవడం జరిగిపోయాయి. ఇక కథానాయుకల విషయంలోనూ సాయి పల్లవి, కీర్తి సురేశ్‌ల మధ్యే చర్చలు నడుస్తున్నట్లు వార్తలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే.. తాజాగా ఈ స్థానంలోకి సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ పేరు రావడం సినీ లవర్స్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో హాల్‌చల్ చేస్తోంది. అంతేగాక ఈ సినిమాకు దేవీనే సంగీతం కూడా అందించనున్నట్లు సమాచారం.ఇప్పటికే డ్యాన్స్, నటనలోనూ దేవీకి అద్భుత ప్రతిభ ఉంది. అయితే ఈ వార్తల విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రకటన అయితే లేదు. మేకర్స్ , దర్శకుడు వేను, దిల్ రాజు, దేవీ శ్రీ ప్రసాద్ స్వయంగా స్పందిస్తే తప్ప ఈ వార్తలపై క్లారిటీ రాదు. ఇదిలాఉంటే.. కుమారి 21ఎఫ్ సినిమా సమయంలో దేవి శ్రీ ప్రసాద్‌ని నా ఎస్వీసీ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరోగా పరిచయం చేస్తాను అని దిల్ రాజు గతంలోనే మాట ఇచ్చాడు. కానీ దశాబ్దం గడిచినా అది ముందుకు పడలేదు. ఇప్పుడు ఈ చిత్రంతో అటు వేణు, ఇటు డీఎస్పీ ఇద్దరిని కలిపి సినిమా తీస్తే దిల్ రాజు ఇచ్చిన మాట కూడా నేరవేరినట్లే అవుతుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఎల్లమ్మ సినిమా విషయంలో ఎలాంటి వార్తలు వస్తాయో ఎదురు చూడాలి.









## సరదాగా సాగే కథతో కె ర్యాంప్

### హీరో కిరణ్ అబ్బవరం వెల్లడి

'ఈ సినిమా చేయాలని అనుకున్నప్పుడే దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఖచ్చితంగా కుటుంబ సభ్యులందరూ కలసి చూసే చిత్రం అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. నన్నూ, మా చిత్ర బృందాన్ని నమ్మండి. ఈ దీపావళి పండుగ 'కె.ర్యాంప్' తో మరింత సరదాగా ఉంటుంది. ఇకపై నా అభిమానులు గర్వపడేలా సినిమాలు చేస్తా' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంకా ఆయన మాట్లాడుతూ.. మాపై నమ్మకంతో రండి కడుపుబ్బా నవ్వించి తీరుతాం అని థియేటర్‌లో ఒక్కొక్కడికి బుర్రపాడు.. గుడ్డలు జారుడే అనేలా సినిమా ఉంటుందన్నారు. టికెట్ డబ్బులు వేస్ట్ అయ్యాయనే మాట రానివ్వమని అన్నారు. జైన్స్ నాని మాట్లాడుతూ 'సినిమా ÷-లక్లైమాక్స్‌లో ఒక చిన్న ట్విస్ట్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంటుంది. అన్ని వాణిజ్య హంగులతో తెరకెక్కించాం. కిరణ్ అబ్బవరం పాత్రచిత్రణ సరికొత్తగా ఉంటుంది. ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రను ఈ చిత్రంలో పోషించారు. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది' అని చెప్పారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమాను 47 రోజుల్లో పూర్తి చేశాం. కేరళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రీకరణ చేశాం. సెట్‌లో ప్రతి రోజూ నవ్వుకున్నాం. సెట్‌లో నవ్వించిన ఏ సినిమా కూడా సక్సెస్ విషయంలో గురి తప్పలేదు. 'కె- ర్యాంప్' కూడా మంచి విజయాన్ని అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన తర్వాత అందరూ మహేశ్ బాబు, అల్లు అర్జున్, నాని తర్వాత కిరణ్ పేరే చెబుతారు. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం అందించారు. భవిష్యత్తులో జైన్స్ నాని పెద్ద దర్శకుడు అవుతాడు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, నటుడు సాయికుమార్, హీరోయిన్లు విమలా రామన్, కామ్నా జెఠ్మలానీ, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

## సామ్రాజ్యం ప్రోమో విడుదల చేసిన ఎన్టీఆర్

తమిళ అగ్ర హీరో శిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు హీరోగా జాతీయ అవార్డు దర్శకుడు, క్రియేటివ్ జీనియస్ వెట్రిమారన్ తెరకెక్కిస్తున్న చిత్రం అరసన్. తెలుగులో సామ్రాజ్యం పేరుతో రానుంది. తాజాగా ఈ చిత్రం ప్రోమోను యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఇంకా షూటింగ్ పూర్తిగా పట్టాలెక్కని ఈ చిత్రం ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన ప్రోమో 4 నిమిషాలకు పైగా ఉండడమే గాక చూస్తే చాలా రా అండ్ రస్టిక్ లాగా ఉంది. హత్యా నేరం అభియోగంతో కోర్టుకు వచ్చిన హీరో జడ్జి ముందు నాకేమీ తెలియదు నన్ను ఇరికించారు అని చెబుతూనే మరో వైపు యంగ్ హీరో ముగ్గురిని నరికి చేతులు కడిగే సన్నివేశాలను ప్రజెంట్ చేశారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. ప్రోమో ఆరంభఃలో జైలర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఎంట్రీ అతనితో హీరో మాట్లాడే డైలాగ్స్ అదిరిపోయాయి. ముఖ్యంగా నా స్టోరీని ఎవరితో చేపిద్దామనుకుంటున్నారు.. ఎన్టీఆర్‌తో చేపించండి కుమ్మేస్తాడు అంటూ శింబ ఉచెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గతంలో వెట్రిమారన్, ధనుష్ కాంబోలో వచ్చిన వడ చెన్నై సినిమాను యూనివర్స్‌గా మార్చి అందులో ఓ పార్ట్‌గా ఈ సినిమాను తీసుకు వస్తున్నారు. ఇదిలాఉంటే ఈ చిత్రంలో సమంత, కీర్తి సురేశ్, సాయి పల్లవిలు ముగ్గురిలో ఇద్దరు కథానాయికలుగా చేయనున్నట్లు తెలుస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com